ప్రజాశక్తి

ఆదివారం 25 ఆగస్టు 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా









ఎ.కొండూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న బాబూరావు, పాల్గొన్న కిడ్నీ బాధితులు

15 రోజుల్లో స్పందించకుంటే

ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధిస్తాం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు
- ఎ.కొండూరులో కిడ్నీ రోగులతో ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ, ఎ.కొండూరు

ఎన్‌టిఆర్ జిల్లాలో కిడ్నీ రోగుల సమస్యలపై 15 రోజుల్లో ప్రభుత్వం స్పందించాలని, లేకుంటే ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు హెచ్చరించారు. ఎ.కొండూరు మండలం, ఇతర మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో జరుగుతున్నవి కిడ్నీ మరణాలు కాదని, ప్రభుత్వ హత్యలని విమర్శించారు. ఎ.కొండూరు, గంపలగూడెం తదితర మండలాల్లో కిడ్నీ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సమగ్ర చర్యలు చేపట్టాలని కోరుతూ శనివారం ఎ.కొండూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో కిడ్నీ రోగులు ధర్నా నిర్వహించారు. ముందుగా వారం రోజులకు పైగా సిపిఎం నాయకులు పలు గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటికీ సర్వేలో వచ్చిన అంశాలతో తహశీల్దార్ బి.ఆశయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాకు సిపిఎం ఎ.కొండూరు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా బాబూరావు మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రక్షిత మంచినీటిని కుళాయిల ద్వారా సరఫరా చేసి, ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడకుండా నిలువరిస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కిడ్నీ మహమ్మారి తీవ్రత, దాని పరిష్కారంపై వచ్చే అసెంబ్లీ సమావేశంలో సమగ్రంగా చర్చించి, పరిష్కార దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే ఎ.కొండూరు ప్రాంతంలో అత్యాధునిక వసతులతో కూడిన సూపర్ స్పెషాలిటీ కిడ్నీ వైద్యశాలలను ఏర్పాటు చేయాలని, కిడ్నీ వ్యాధితో మృతిచెందిన ప్రతి కుటుంబానికి (మిగతా 2లో)

డిమాండ్లు ఇవే...

ఎ.కొండూరు మండలంతో పాటు ఇతర మండలాల్లో కిడ్నీ సమస్య పరిష్కారానికి సిపిఎం పలు డిమాండ్లను అధికారుల ముందుంచింది. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని, శుద్ధి చేసిన కృష్ణానది నీటిని కుళాయిల ద్వారా ఇంటింటికీ అందించాలని, క్రియాటిన్ 2 దాటిన వారందరికీ నెలకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని, డయాలసిస్ రోగులకు ఇస్తున్న పెన్షన్ రూ.20 వేలకు పెంచాలని, కిడ్నీ బాధితులకు మందులు ఉచితంగా ఇవ్వాలని, కిడ్నీ వ్యాధితో మృతిచెందిన కుటుంబాలకు ఎకరం భూమి, రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలని, మట్టి ఖర్చులకు రూ.25 వేలు ఇవ్వాలని, వ్యాధిగ్రస్తులందరికీ పౌష్టికాహారం అందించాలని సిపిఎం నాయకులు ఎ.కొండూరు తహశీల్దార్ ఆశయ్యకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఆయన తన పరిధిలో ఉన్న వాటిని పరిష్కరించి, మిగిలిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.



అధికారికి వినతిపత్రం ఇస్తున్న బాధితులు, సిపిఎం నాయకులు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి గంగాధరరావు

గంజాయిపై ఉక్కుపాదం

- నేర సమీక్షలో కృష్ణాజిల్లా ఎస్‌పి గంగాధరరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణాజిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ఆర్.గంగాధర్‌రావు హెచ్చరించారు. కృష్ణాజిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గంజాయిని గుర్తించేందుకు ఇప్పటికే ప్రత్యేక బందాలను ఏర్పాటు చేశామన్నారు. గంజాయి ఎక్కడి నుంచి వస్తుంది? ఎక్కడికి వెళుతుందనే ఫార్వర్డ్ బ్యాక్వర్డ్ లింక్స్ తెలుసుకుని, నేరస్తులందరినీ అరెస్టు చేయాలని సూచించారు. వారంలో కొన్ని ప్రాంతాలను ఎంచుకొని ఆ ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించాలని, కేసులు ఎక్కువ నమోదవుతున్న ప్రాంతాలలో మ్యాపింగ్ చేయాలని చెప్పారు. గంజాయిని నివారించే దానిలో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. దొంగతనం జరిగిన వెంటనే నేర ప్రదేశంలో క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్ సేవలను ఉపయోగించు కోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు, నేరాలు జరిగే ప్రాంతాలలో ప్రతిరోజు విజిబుల్ పోలీసింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా పల్లెలు, పట్టణాలలో అపార్ట్మెంట్స్ వద్దకు వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళల రక్షణకోసం ఏర్పాటు చేసిన డయల్ 112 గురించి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. వినాయక చవితికి సంబంధించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుగానే పూర్తి సమాచారాన్ని సేకరించి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కోడి పందేలు, పేకాట, క్రికెట్ బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (ఇంచార్జ్ అడ్మిన్) ప్రసాద్, డిఎస్‌పిలు అబ్దుల్ సుభాన్, ఎ.సుభాష్, పి.మురళీధర్, సిహెచ్.శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ రంగనాథ్ పాల్గొన్నారు.

పర్యాటక రాజధానిగా అమరావతి

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ

ప్రజాశక్తి-తుళ్లూరు

ప్రజా రాజధాని అమరావతిలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు బ్లూ-గ్రీన్ ప్రాజెక్టులతో ఆకర్షణీయమైన పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. శాఖమూరు, అనంతవరం, నీరుకొండ ప్రాంతాల్లో అందమైన రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టి పర్యాటకానికి కేంద్ర బిందువుగా తీర్చిదిద్దుతామన్నారు. శనివారం అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథితో కలిసి అమరావతిలో వెంకటపాలెం నర్సరీ, శాఖమూరు సెంట్రల్ పార్కులను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ పెంచుతున్న వివిధ రకాల మొక్కలను గురించి లక్ష్మీపార్థసారథిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాఖమూరు సెంట్రల్ పార్కులోని ప్రగతి రిసార్టులో విలేకరుల సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ నార్మన్ ఫోస్టర్ అండ్ పర్టనర్(లండన్), సింగపూర్‌కు చెందిన నిష్ణాతులతో అమరావతి మాస్టర్ ప్లాన్ రూపొందించటం జరిగిందన్నారు. హైదరాబాద్ మహా నగరాన్ని పచ్చదనంతో అద్భుతంగా తీర్చిదిద్దిన సీనియర్ అధికారి లక్ష్మీపార్థసారథికి అమరావతిలో పచ్చదనం ప్రాజెక్టుల అభివద్ధి బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందన్నారు. ఎడిసి నేతృత్వంలో 300 ఎకరాల్లో నిర్మాణంలో ఉన్న శాఖమూరు సెంట్రల్ పార్కులో బోటింగ్‌కు అనువుగా 50 ఎకరాలలో రిజర్వాయర్‌ను నిర్మించి పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. దీనితో పాటుగా నీరుకొండలో 500 ఎకరాలలో వాటర్ లేక్‌లకు సన్నద్ధం చేస్తున్నామన్నారు. కొండవీటివాగు, పాలవాగు గ్రావిటీ కెనాల్ వంటి నీటి ప్రాజెక్టుల వెంబడి 20-30 మీటర్ల వెడల్పుతో బఫర్ జోన్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు. 35 ఎకరాలలో అనంతవరం ఉద్యానవనం, రాష్ట్ర సచివాలయం ముంగిట 21 ఎకరాలలో మల్కాపురం పార్కును ఏర్పాటు చేసి ఇందులో విభిన్న రకాల ఔషధ గుణాలు కలిగిన వివిధ రకాల మొక్కలను పెంచటం జరుగుతుందన్నారు.



వెంకటపాలెం నర్సరీలో యంత్రంతో గడ్డి చదును చేస్తున్న మంత్రి నారాయణ

360 కి.మీ మేర రాజధాని రవాణా వ్యవస్థ

అమరావతిలో ఏడీసీ ఆధ్వర్యంలో 360 కి.మీ మేర సువిశాలమైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి రానుందని మంత్రి నారాయణ చెప్పారు. రూ.41 వేల కోట్లతో ముఖ్యమైన మౌలిక సదుపాయాలైన వాటర్ లైన్లు, ఐసీటీ, పవర్, గ్యాస్,స్ట్రామ్ వాటర్ డ్రైన్లు, నీటిపారుదల వ్యవస్థల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో రూ.5,100 కోట్లు ఖర్చు చేసినట్లు గణాంకాలతో వివరించారు. వైసిపి ప్రభుత్వం రాజధానిపై మూడు ముక్కలాటాడటంతో ముళ్లకంపతో నిండిపోయిందన్నారు. రూ.36 కోట్లతో కంప తొలగింపు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. మరో నెల రోజుల్లో ఈ పనులు పూర్తిచేస్తామన్నారు.

సెప్టెంబరు మొదటి వారంలో ఐఐటీ నివేదికలు

రాజధాని అమరాతిలో గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ప్రాజెక్టుల స్థితి గతులపై మద్రాస్ ఐఐటి, హైదరాబాద్ ఐఐటి వారు పర్యటించి క్షేత్రస్థాయిలో నివేదికను వచ్చే నెలా మొదటి వారంలో రాష్ట్ర ప్రభుత్వానికి అందించనున్నారని మంత్రి చెప్పారు. ఎస్-ఎస్ఆర్ ధరల ప్రకారం పూర్వ ప్రాజెక్టు అంచనాలు,నేటి నిర్మాణ అంచనాలను సిఆర్‌డిఎ అథారిటీకి నివేదించి ఆపై మంత్రివర్గానికి పంపనున్నట్లు స్పష్టం చేశారు. ఈ పర్యటనలలో అమరావతి అభివృద్ధి సంస్థ గ్రీనరీ అధికారులు పాల్గొన్నారు.

ప్లాట్‌ఫారాలు సరే... ఫ్లోరింగ్ సంగతేంటి..?

అదుపు తప్పి పడిపోతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్లో 1 నుంచి 16వ ప్లాట్‌ఫామ్స్ వరకు ఉన్న వాటికి మరమ్మతు పనులు జరుగుతున్నాయి. పూర్తిగా దెబ్బతిని, లో లెవల్‌గా ఉండి, కొన్ని సందర్భాల్లో బస్సులు సైతం లోపలకు ప్రవేశించే స్థితిలో ఉన్న నేపథ్యంలో ఈ ప్లాట్‌ఫారాల ఎత్తు పెంచి, నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయిస్తున్నట్లు ఆర్టీసి అధికారులు వివరిస్తున్నారు. గత కొన్నేళ్ల నుంచి ఎటువంటి మరమ్మతు పనులు జరగక, ఇటీవల ఒక బస్సు లోపలకు



దూసుకెళ్లి ప్రాణనష్టం జరిగిన ఘటన తీవ్ర సంచలనం సృష్టించిన నేపథ్యంలోనే ప్రస్తుతం ప్లాట్‌ఫారాలను మరమ్మతు చేయిస్తున్నారు. అయితే బస్‌స్టేషన్ వెలుపల ప్రాంగణంలోని ఫ్లోరింగ్ కూడా పూర్తిగా దెబ్బతింది. దీని వల్ల అదుపు తప్పి ప్రయాణికులు పడిపోతున్న సంఘటనలు కోకొల్లలుగా నమోదు అవుతున్నాయని స్వయంగా ఇక్కడ కంట్రోలర్స్‌గా పని చేస్తున్న అనేక మంది బహాటంగానే వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్లాట్‌పారాల నుంచి కదులుతున్న బస్సులను ఎక్కేందుకు దెబ్బతిన్న ఫ్లోరింగ్‌పై హడావుడిగా నడుస్తున్న క్రమంలో అదుపు తప్పి వృద్ధులు, మహిళలు, కొన్ని సందర్భాల్లో యువకులు సైతం పడిపోతూ దెబ్బలు తగులుతున్నాయని ఆర్టీసి కంట్రోలర్స్ వ్యక్తం చేస్తున్నారు. బస్‌స్టేషన్‌లోని వచ్చే ఆర్టీసి సర్వీసులు, ఇతర సర్వీసులు, ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిపోయి, ఏళ్ల తరబడి ఫ్లోరింగ్‌కు కనీస మరమ్మతు పనులు కూడా



చేయనందున, పెరిగిన రద్దీ వలన ఎక్కడికక్కడ ఫ్లోరింగ్ దెబ్బతిన్నది. దీని రూపురేఖలే మారిపోయింది. ఈ ఎగుడు దిగుడు ఫ్లోరింగ్ మీద ఆర్టీసి సర్వీసులను నడిపే క్రమంలో వాటికుండే బేరింగ్‌లు, ఇతర పరికరాలు కూడా దెబ్బతింటున్నాయని ఆర్టీసి డ్రైవర్లు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆర్టీసి ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికయినా ఫ్లోరింగ్‌కు మరమ్మతు పనులు చేసి, ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు, ఆర్టీసి డ్రైవర్లు కోరుతున్నారు.

నీటి సమస్యపై స్పందించడం హర్షణీయం

ప్రజాశక్తి-విజయవాడ: నగర నీటి సమస్యపై ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ పంపిన మెమొరాండానికి స్పందించిన రాష్ట్ర



ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ ఎంవి ఆంజనేయులు అన్నారు. స్థానిక బెల్లపు శోభనాద్రీ గ్రంథాయలంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ నగర నీటి అవసరాల కోసం ప్రకాశం బ్యారేజికి దిగువన చెక్‌డ్యాం నిర్మాణానికి అంచనాలను తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపామని జల వనరుల శాఖ తెలిపిందన్నారు. విజయవాడ నగరంలో తలెత్తిన నీటి సమస్యను దృష్టిలో పెట్టుకొని గత జూన్ 22 వతేదీన టాక్స్ పేయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి మెమొరాండాన్ని పంపిందన్నారు. నగర నీటి అవసరాలు తీర్చటం కోసం ప్రకాశం బ్యారేజీకి దిగువన 5 టీయంసీల నీరు నిల్వ ఉండేవిధంగా చెక్ డ్యాంను నిర్మించాలని, నగరంలోని పాత నీటి పైపులను పూర్తిగా మార్చటం కోసం మున్సిపల్ కార్పొరేషన్ కు నిధులను ఇవ్వాలని టాక్స్ పేయర్స్ అసోసియేషన్ ఆ మెమొరాండంలో కోరిందన్నారు. దీనికి స్పందిన రాష్ట్ర ప్రభుత్వం టాక్స్ పేయర్స్ అసోసియేషన్ ప్రతిపాదనలను జలవనరుల శాఖకు పంపిందన్నారు. వరదనీటిని ఆపేవిధంగా కృష్ణా నదిపై ప్రకాశం బారేజికి దిగువన పెనమలూరు మండలం చోడవరం గ్రామం వద్ద 4.131 టియంసి సామర్థ్యంతో ఒక చెక్‌డ్యాంను, మోపిదేవి మండలం బండికోళ్ళంక గ్రామం వద్ద 4.95 టియంసి సామర్థ్యంతో మరో చెక్‌డ్యాంను నిర్మించడానికి అంచనాలను తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వం ముందుంచామని, ప్రభుత్వ ఆమోదం రాగానే ప్రాజెక్టు పనులు చేపడతామని జలవనరుల శాఖ తెలియజేసిందన్నారు. నగరంలోని పాత నీటి పైపులను పూర్తిగా మార్చే విషయంలో సత్వరమే స్పందిచవలసిందిగా కోరుతూ విజయవాడ మున్సిపల్ కమీషనర్‌కు సిడియంఎ లేఖ రాసిందన్నారు. చోడవరం వద్ద చెక్ డ్యాంను నిర్మించటం, విజయవాడ నగరంలో పాతపైపులు మార్చి వాటి స్థానంలో హెచ్‌డి పైపులను ఏర్పాటు చేయటం జరిగితే విజయవాడ నగరంలో నీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షులు వి సాంబిరెడ్డి, నాయకులు వివిఎస్‌రామరాజు, వేదాంతం శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు కమిషనర్ అభినందన

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని, అంతర్జాతీయ, జాతీయ పోటీల్లో రాణించిన క్రీడాకారులను అభినందించి మరిన్ని పతకాలు సాధించాలని అన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆర్టిస్టిక్ పోటీల్లో ఎన్నో పతకాలను సాధించిన చైత్రదీపిక, దియాశ్రీలను విజయవాడ మునిసిపల్ కమీషనర్ ధ్యానచంద్ర శనివారం తన ఛాంబర్లో అభినందించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన ఎన్ఎస్ఎం స్కూల్లో 9వ తరగతి చదువుతున్న చైత్రదీపిక ఇటీవల పొల్లాచి (కోయంబత్తూరు)లో ఆగస్టు 7 నుండి 11 వరకు జరిగిన 2వ ఇండియా స్కేట్ గేమ్స్‌లో 14 -17 గ్రూప్‌లో ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో మూడు పతకాలు-సోలో డాన్స్ (రజతం), ఫ్రీ స్కేటింగ్ (రజతం), క్వార్టెట్ (కాంస్యం) సాధించింది. రోలర్ స్కేటింగ్ నేషనల్ ఛాంపియన్షిప్ కైవసం చేసుకుంది. 11 -14 గ్రూప్‌లో దియాశ్రీ-పెయిర్ స్కేట్లో (కాంస్యం), సోలో డాన్స్ (రజతం) పతకాలు సాధించింది. రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ పతకాలు సాధించి విజయవాడ క్రీడా ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని మునిసిపల్ కమిషనర్ క్రీడాకారులకు సూచించారు.

కుళాయి సర్వే పరిశీలన

ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి సర్వేను విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం గవర్నర్‌పేటలో పరిశీలించారు. విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న ప్రతి అసెస్మెంట్ కి ఖచ్చితంగా ఈ సర్వేను నిర్వహించాలని, నిర్వహించిన సర్వే నివేదికను ఎటువంటి తప్పులు లేకుండా ఆన్లైన్లో జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ప్రతి సర్కిల్లో సర్వే వేగవంతంగా నిర్వహించేటట్టు జోనల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ, ఇంజనీరింగ్, అధికారుల సహకారంతో సత్వరమే ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి సర్వేను పూర్తి చేసి నివేదికన



సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వాటర్ సప్లై రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్ నర్మదా పాల్గొన్నారు.


మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధిస్తాం

రూ.5 లక్షలతో పాటు ఎకరం పొలం ఇవ్వాలని, కిడ్నీ బాధితులకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని, డయాలసిస్ రోగులకు రూ.20 వేలు పింఛను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ మాట్లాడుతూ భావితరాలను కాపాడుకునేందుకు, కిడ్నీ వ్యాధి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నిపుణులతో లోతైన అధ్యయనం చేయించి, సమగ్ర చర్యలు చేపట్టడానికి నిధులు కేటాయించాలని కోరారు. ప్రస్తుతానికి రక్షిత మంచినీటిని ట్యాంకర్ల ద్వారా ఇంటింటికీ సరఫరా చేయాలన్నారు. ఈ నెల 17న ఎ.కొండూరు మండలంలోని చైతన్యనగర్ తండాలో బాణావతు పగిడెమ్మ, ఆ మరునాడే చీమలపాడు తండవాసీ జరబన దుర్గ కిడ్నీ వ్యాధితో మరణించారని తెలిపారు. గంపలగూడెం మండలం అనుమల్లంక గ్రామంలో ఒకే రోజు ఇద్దరు చనిపోయారని, ఈ ఏడాదిలో జిల్లాలో 63 మంది చనిపోయారని తమ పార్టీ నిర్వహించిన సర్వేలో తేలిందని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి ఆంజనేయులు, ఎం నాగేంద్రప్రసాద్, కోటా కళ్యాణ్, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయిలో అమల్లోకి తీసుకొస్తే ఎన్‌టిఆర్ జిల్లాలోని 12 మండలాల పరిధిలో వ్యవసాయం సస్యశ్యామలం కావడంతో పాటు భూగర్భజలాలు కలుషితం కాకుండా ఉంటాయని, కిడ్నీ వ్యాధి నుంచి ప్రజలను రక్షించవచ్చునని అన్నారు. ఉద్దానం తరువాత ఎ.కొండూరు మండలంలోనే కిడ్నీ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉందని, ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గంపలగూడెం మండల కార్యదర్శి జి.సీతారెడ్డి, విస్సన్నపేట మండల కార్యదర్శి వి.నాగరాజు, తిరువూరు రూరల్ మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, మైలవరం, ఇబ్రహీంపట్నం నాయకులు సి.హెచ్ సుధాకర్, ఎం.మహేష్, సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, సిపిఎం నాయకులు ఆనందరావు, రామకృష్ణారెడ్డి, జవలమ్మ, అమ్మిరెడ్డి, పంబి వెంకటేశ్వరరావు, జ్ఞానరత్నం, మోహన్, ఎస్ఎఫ్ఐ నాయకులు కుమార్ నాయక్, వివిధ గ్రామాల నుండి వందల సంఖ్యలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు, డయాలసిస్ రోగులు పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ: ఎ.కొండూరులో నిర్వహిస్తున్న డయాలసిస్ సెంటర్‌ను సిపిఎం నేతలు శనివారం పరిశీలించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు పివి ఆంజనేయులు, కోటా కళ్యాణ్, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, స్థానిక నాయకులు డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వైద్యశాలలో అపోలో సంస్థ నిర్వహణలో నడుస్తున్న ఈ డయాలసిస్ సెంటర్‌లో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మైలవరంనకు చెందిన వేమూరి కృష్ణ, రుద్రవరం గ్రామానికి చెందిన ఎ.నారాయణ, కొవిటకుంట గ్రామానికి చెందిన కొండలరావు వైద్యశాలలో డయాలసిస్ చేయించుకుంటున్నారు. పూర్తిస్థాయిలో వైద్యం అందుబాటులో ఉండటం లేదని, ఈ సెంటర్‌కు మారడం ద్వారా గతంలో ఇచ్చిన పెన్షన్లు ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వడం మానుకుందని, గత ఆరు నెలల నుంచి పెన్షన్ ఆగిపోయిందని, వారానికి మూడు సార్లు డయాలసిస్ కోసం ఈ కేంద్రానికి రావాల్సి వస్తుండటంతో పలు రూపాల్లో ఖర్చులవుతున్నాయని వారు వాపోయారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి తీవ్రత, ఈ ప్రాంతంలో నమోదు అవుతున్న పేషెంట్ల సంఖ్యకనుగుణంగా డయాలసిస్ సెంటర్‌లో సదుపాయాలు, వైద్య సేవలు అందుబాటులోఉంచాలన్నారు. డయాలసిస్ చేయించుకోవడానికి వస్తున్న వారికి ఇవ్వాల్సిన ఇంజక్షన్లు కూడా ఉండటం లేదన్నారు. అధిక ధరలు వెచ్చించి, విజయవాడ, ఇతర ప్రాంతాల్లో కొనుక్కోవాల్సి వస్తోందని అన్నారు. రోగుల సంఖ్యకనుగుణంగా డయాలసిస్ సెంటర్‌ను విస్తరించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం మూడు పడకలతోనే నిర్వహిస్తున్నారని, 15 నుంచి 20 బెడ్స్ వరకు సెంటర్‌ను విస్తరించి, బిల్డింగ్‌ను నిర్మించాల్సి ఉందన్నారు.



డయాలసిస్ సెంటర్‌లో రోగులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : విజయవాడ కార్పొరేషన్ పరిధి, మచిలీపట్నం, గుడివాడలో పలు ఉన్నత పాఠశాలలో ఎస్జీటీలు పాఠ్య బోధన చేయుచున్న ఉపాధ్యాయులకు వెంటనే పదోన్నతులు ఇవ్వాలని యు టి ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే శ్రీనివాసరావు, ఏ సుందరయ్య లు డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ ఇప్పటివరకు పదోన్నతుల విషయంలో లోకల్ బాడీ స్కూల్లో అమలు జరిగిన ప్రమోషన్ అర్హతల జీవోలు అమలు కాకపోవడం వల్ల సుదీర్ఘకాలంగా హైస్కూల్లో పదోన్నతులు లేక ఎస్జిటి లుగా పని చేయవలసి వస్తుందన్నారు. వీరికి ప్రమోషన్లలో న్యాయం కోసం కోర్టు ను ఆశ్రయించారన్నారు. కోర్టు ఇచ్చిన అనుకూల ఆదేశాలు, పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు అనుసరించి విజయవాడ కార్పొరేషన్ పరిధిలో అర్హత గల అందరికీ కామన్ సీనియారిటీ ఆధారంగా ఎస్జీటీ, బాషా పండితుల పదోన్నతులు ఇచ్చేందుకు ఆదేశాలు జారీచేసి ఉన్నారన్నాన్నారు.

జెన్పాక్ట్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జెన్పాక్ట్ కంపెనీలో ఉద్యోగాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి ఎస్ శ్రీనివాసరావు,ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు సంయుక్తంగా తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెన్పాక్ట్ ఎంఎన్సి కంపెనీలో కంటెంట్ మోడరేషన్,కస్టమర్ సర్వీస్ వాయిస్ సపోర్ట్ విభాగాలలో 1500 ఖాళీల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఏదైనా డిగ్రీ, బీటెక్ పాసైన అభ్యర్థులు అర్హులన్నారు. . ఈ ఉద్యోగాలఎంపిక ప్రక్రియలో హెచ్ఎర్, టెక్నికల్ రౌండ్లు ఉంటాయని తెలిపారు. ఈ ఉద్యోగాలు హైదరాబాద్‌లోని హఫీజ్ పేట లో రొటేషన్ షిఫ్టుల్లో ఉంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 28 ఆగస్టు 2024 లోపు తమ దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునే వారు, వెంటనే https://bit.ly/46Wzqz6 లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ తేదీ, స్థలాన్ని తర్వాత తెలియజేస్తామని, మరింత సమాచారం కోసం 99888 53335 నంబర్ ను సంప్రదించగలరని తెలిపారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంపొందించాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : పరాయి బాష మోజులో పడి మాతభాష తెలుగును మృత భాషగా తయారు చేస్తున్నారని హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ పి. విజయ్కుమార్ అన్నారు. ఏజీఅంట్ఎస్ఎస్ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'ఆధునిక కవితా వికాసం' అనే అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన ము ఖ్య అతిధిగా పాల్గొని విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. పరాయి బాష మోజులో పడి తెలుగుబాషకు సరైన ఆదరణ ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. తమిళ కవి సుబ్రమణ్య భారతి తెలుగుభాషపై ఎక్కువ మక్కువ చూపించారని గుర్తుచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శివనాథ్ మాట్లాడుతూ అంతరించి పోతున్న తెలుగు భాష ను ముందుతరాల వారికి అందించాలని, తెలుగు భాష గొప్పదనం, ఔన్నత్యం అందరికి తెలియ జేయాలన్నారు. కళాశాల ప్రత్యేక అధికారి కె. సత్యనారాయణ, తెలుగు శాఖ అధిపతి ఎంఎల్ఎస్ కుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.విజయ్కుమార్

డ్రోన్లపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వ విద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో డ్రోన్ హబ్ టెక్నాలజీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం డ్రోన్ టెక్నాలజీ యుఏవిపై విద్యార్థులకు ఒకరోజు సాంకేతిక అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు లో డ్రోన్ హబ్ సంస్థ సాంకేతిక విభాగానికి చెందిన విమల్ పాల్గొని భారతదేశంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతుందని, విద్యార్థులకు సాంకేతిక అవగాహన చాలా ముఖ్యమని అన్నారు. డ్రోన్ సాంకేతికతకు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, మానవ జీవన విధానంలోకి యుఏవిలు చాలా వేగంగా ప్రవేశించి జీవనాన్ని చాలా సరళం చేస్తునాయన్నారు. ఈ సదస్సులో ఇంజినీరింగ్ కళాశాల సి ఎస్ ఈ, ఈసీఈ కి చెందిన మూడు, నాలుగో సంవత్సరం విద్యార్థులు పాల్గొని డ్రోన్ సాంకేతికతపై సందేహలను నివృత్తి చేసుకోన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా .విజయకుమారి, డా.అలిమిరా వీరాంజనేయులు పాల్గొన్నారు.



పెడన కమిషనర్‌గా గోపాలరావు

ప్రజాశక్తి-పెడన : పెడన పురపాలక సంఘ కార్యాలయం కమిషనర్‌గా ఎం. గోపాలరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను పురపాలక సంఘ మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగ కుమారి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజా సమస్యలు, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని అలాగే పట్టణ అభివద్ధికి తోడ్పడాలని ఈ సందర్భంగా నాగ కుమారి ప్రసాద్ మున్సిపల్ కమిషనర్ను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ పురపాలక సంఘంలోని ప్రతి ఒక్కరికి శక్తి వంచన లేకుండా పని చేస్తానని చెప్పారు.



కమిషనర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న చైర్‌పర్సన్

విద్యార్థులకు బస్ పాసులు పంపిణీ



విద్యార్థులకు పాసులు అందిస్తున్న రమణ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం గొల్లనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులకు శనివారం కేవిఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత బస్ పాసులు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది కేవి. రమణ, కార్యదర్శి కెవిఆర్. కిషోర్ చేతుల మీదుగా పాసులు అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ...కేవిఆర్. కిషోర్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ఉచిత బస్ పాసులు అందజేయడం అభినందనీయమని చెప్పారు. నియోజకవర్గంలోని 500 మంది విద్యార్థులకు తమ అసోసియేషన్ రూ. 30 వేల ఆర్థిక సౌజన్యంతో పాసులు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభావంతులైన క్రీడాకారులను, విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యంగా తమ అసోసియేషన్ పని చేస్తుందని కేవిఆర్. కిషోర్ చెప్పారు. కేవిఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ద్వారా సమాజాభివద్ధికి రమణ, కిషోర్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని టిడిపి మండల అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు జగదీశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొ న్నారు. అదేవిధంగా గన్నవరం మండలం సూరంపల్లి జడ్పీ హైస్కూల్లో 100 మంది విద్యార్థులకు బస్సు పాసులు అందజేశారు. ప్రతి ఏడాది ఈ విధంగా విద్యార్థులకు బస్సు పాసులు అందిస్తామని కిషోర్ తెలిపారు.

రాష్ట్ర సదస్సు కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : భూ అక్రమ లావాదేవీలను రద్దుచేసి పేదల అక్రమణలో ఉన్న భూములకు,ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి లింగంఫిలిప్ అన్నారు. శనివారం మోదుమూడిశ్రీహరిరావు భవనంలో ఈనెల 28వ తేదీ విజయవాడలో జరిగే భూ బాధితుల రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ ఈ సందర్భంగా పిలిఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల ధరలు పెరిగాయని, నాయకులు దొంగ పట్టాలు సృష్టించి వందల ఎకరాలు దోచుకుంటున్నారని, దీనికి పరాకాష్ట సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు తగలబెట్టడం అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి పట్టణ కార్యదర్శి ఓఎల్ రావు, సిపిఐ నాయకులు షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు

పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్ర రైతుల సాగునీటి హక్కులు సాధించేందుకు సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకష్ణారావు పోరాటం చేస్తున్నారని గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు కితాబిచ్చారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆళ్ళ వెంకట గోపాలకష్ణారావు జన్మదిన వేడుకలను గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ 'ఆళ్ళ' తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్లు యనమద్ది పుల్లయ్యచౌదరి, గుత్తా శివరామకష్ణ, రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమా వరప్రసాదు, వేములపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-గుడివాడ : ఈనెల 18వ తేదీన కోడూరు మండలం హంసలదీవి బీచ్ వద్ద సముద్రంలో గల్లంతయిన గుడి వాడకు చెందిన యువకుడు అబ్దుల్ ముషా రఫ్ (21) మృతదేహం ఎట్టకేలకు లభ్యమయింది. గత ఆరు రోజులుగా మతదేహం కోసం ప్రత్యేక బోట్లలో గాలింపు చర్యలు చేపట్టగా శుక్రవారం రాత్రి బందరు మండలం కె.పి టి పాలెం వద్ద ముషారఫ్ మతదేహం కనిపించినట్లు కోడూరు ఎస్సై పి.శిరీష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మతదేహాన్ని పంచనామా అనంతరం పోస్టుమార్టం చేసి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగిం చనున్నట్లు ఎస్సై తెలిపారు.



ముషారఫ్ మృతదేహం

బెయిల్‌పై విడుదల

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాయలం దాడి కేసులో జైలుకు వెళ్లిన వైసీపీ నేతలు, కార్యక ర్తలకు బెయిల్ రావ డంతో శనివారం నూజవీడు సబ్ జైలు నుంచి విడుదలైయ్యారు. సబ్ జైలు నుంచి బయటకు వచ్చిన వారికి గన్నవరం జడ్పీటీసి ఎలిజిబెత్ రాణీ, జిల్లా వైఎస్సాఆర్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు నిడమానూరు సర్పంచ్, శీలం రంగారావు, పార్టీ నాయకులు మేచినేని వెంకట శివ సత్యనారాయణ(బాబు) స్వాగతం పలికారు.

చల్లపల్లి ఎస్ఐగా సుబ్రహ్మణ్యం



ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి నూతన ఎస్సైగా పిఎస్ వి.బాలసుబ్రమణ్యం శనివారం బాధ్యతలు చేపట్టారు. కొత్త ఎస్ఐకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు.

వీరవల్లి ఎస్ఐగా శ్రీనివాస్



ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం వీరవల్లీ ఎస్ఐగా శ్రీనివాస్ శనివారం భాత్యతలు స్వీకరించారు. ఈయన గుడివాడ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి-కోడూరు : పురుగు మందులు, ఎరు వులు నిర్ణీత ధరలకు మించి అధిక ధరలకు అమ్మ రాదని కోడూరు మండల వ్యవసాయ శాఖ అధికారి యం. శ్రీధర్ తెలిపారు. శనివారం కోడూరులో ఎరువులు షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు అవరసమైన అన్ని ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచే విధంగా చూడాలని డీలర్లకు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల సిఫార్సుకు మించి రైతులు పొలంలో ఎరువులు పురుగు మందులు వాడరాదని తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి మోపిదేవి : అగ్నిప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ ఆసరాగా నిలుస్తోందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోపిదేవి సబ్ బ్రాంచ్ అధ్యక్షులు యర్రంశెట్టి సుబ్బారావు అన్నారు. ఇటీవల మోపిదేవి మండలం వెంకటాపురం శివారు అన్నవరంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో పేరుబోయిన నాంచారమ్మ వెంకటేశ్వరరావుల పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. శనివారం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో స్టీల్ సామాన్లు, బియ్యం, సరుకులు, కూరగాయలు అందచేశారు. రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, సర్పంచ్ తుమ్మా సోములమ్మ, వీఆర్ఓ కే.వీ.ప్రసాద్, కార్యదర్శి జీ.సుధాకర్, పీ.శ్రీనివాసరావు, వీఆర్ఏ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం పట్నానికి చెందిన బైక్ మెకానిక్ పోలిశెట్టి శేషు అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని శనివారం టిడిపి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ పరామర్శించి రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా లితీష్ మాట్లాడుతూ పార్టీ పరంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెల రాధాకృష్ణ, దూరు బాలకష్ణ, బెనర్జీ, జల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహన్‌రావుకు అవార్డు



ప్రజాశక్తి - భవానీపురం : ప్రముఖ చిత్రకారుడు, గిరిజన గీత శిల్పి బొండా జగన్మోహన రావుకు ప్రతిష్టాత్మకమైన ప్రైడ్ భారత్ – 2024 అవార్డు లభించింది. ట్రైబల్ లైఫ్‌కు సంబంధించి కాన్వాస్‌పై అత్యధికంగా చిత్రాలను వేసినందుకు గానూ బొండా జగన్మోహనరావుకు భోపాల్‌కు చెందిన 'ది గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్' ఈ అవార్డును అందజేసింది. భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలో నివాసం ఉంటున్న ఆయన శనివారం కొరియర్ ద్వారా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా బొండా జగన్మోహనరావు మాట్లాడుతూ గిరిజనుల జీవితాలపై, గిరిజనుల జీవనవిధానం, వారి కష్టనష్టాలు, తదితర సామాజిక అంశాలపై తాను గీసిన చిత్రాలకు తాను దాదాపు 200 మేరకు జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్నానని చెప్పారు. కొండ కోనల్లో జీవితం గడిపే ఆదివాసీలకు సైతం సమాజంలో తగిన గౌరవం, న్యాయం దక్కాలనే ఉద్దేశంతో తాను ట్రైబల్ లైఫ్‌కు సంబంధించిన చిత్రాలను ఎక్కువగా గీస్తున్నట్లు బొండా జగన్మోహనరావు వివరించారు. వివిధ సామాజిక అంశాలపై చిత్రాలను గీసి వారి అభ్యున్నతికి తోడ్పడాలని చిత్రకారులకు ఆయన సూచించారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వత్సవాయి : ఆదివారం (25)న ఉచిత కంటి వైద్య శిబిరం వత్సవాయిలో నిర్వహిస్తున్నట్లు కొమరగిరి ట్రస్ట్ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్, పిన్నమనేని హాస్పిటల్ పిఆర్ఓ రాఘవ తెలిపారు. చిన్న అవుటుపల్లి పిన్నమనేని సిద్దార్థ కంటి ఆసుపత్రి, కొమరగిరి ట్రస్ట్ ఆధ్వర్యంలో వత్సవాయి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర హైస్కూల్, వేములనర్వ రోడ్డులో గల ఉచిత నేత్ర వైద్య పరీక్షలు ఉదయం 10.30 గంటలు నుండి మధ్యాహ్నం 2 గంటలు వరకు నిర్వహించబడును. నేత్ర వైద్య శిబిరంలో కంటి ఆపరేషన్లు అవసరం అయిన వారికి అదే రోజు ప్రత్యేక బస్సులో తీసుకొని వెళ్లి ఉచితంగా చేయించడం జరుగుతుంది. వైద్య శిబిరానికి ఆధార్‌కార్డుతో హాజరు కాగలరని తెలిపారు.

పాఠశాలల్లో కిచెన్ గార్డెన్

ప్రజాశక్తి - గంపలగూడెం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో నూతన విధానాన్ని అమలు చేసేందుకు ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు. పాఠశాలలో అదనంగా ఉన్న ఖాళీ భూమిని సేద్యం చేసి, విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అవసరమైన పెరటి (కిచెన్ గార్డెన్) ఆకు కూరలు, వివిధ కూరగాయల మొక్కలు ఏర్పాటు చేసి, పండించేందుకు సిద్ధం చేశారు. ఇప్పటికే ఆర్లపాడు, ఊటుకూరు గ్రామాల్లో ఈ పెరటి ఆకుకూరలకు వేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం, గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం ఎం.వెంకటేశ్వరావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు, పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం.రాంప్రదీప్ నోటు పుస్తకాలు బహూకరించారు. దాతకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.బి.రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు ఎస్.రామారావు, వై.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కేరళ బాధితులకు 'నేతాజీ' సాయం



ఎంఎల్‌సి లక్ష్మణరావు చేతులమీదుగా తిరుపతి రెడ్డి, దినేష్, విద్యార్థులు

ప్రజాశక్తి - భవానీపురం : ఇటీవల కేరళ విపత్తుతో సర్వం కోల్పోయిన బాధితులకు స్థానిక భవానీపురంలోని నేతాజీ హైస్కూల్ విద్యార్థులు, మేనేజ్‌మెంట్ కలిసి తమవంతు సహాయంగా రూ.85,500లు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు హైస్కూల్ ప్రిన్సిపాల్ కె.అరుణకుమారి చెప్పారు. శనివారం ఎంఎల్‌సి లక్ష్మణరావు చేతుల మీదుగా ఈ సహాయాన్ని కేరళ ప్రభుత్వ రిలీఫ్ ఫండ్‌కి పంపించారు. కేరళ వరదల్లో చిక్కుకొని వందలాదిమంది మృతి చెందడం, వేలాదిమంది నిరాశ్రయులు కావడం ప్రజల హృదయాలను దారుణంగా కలిచి వేసిందని చెప్పారు. కేరళ వరదల విషయాన్ని తమ హైస్కూల్ విద్యార్థులకు తెలియజేసిన వెంటనే వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలను సేకరించడం అభినందనీయమన్నారు. కేరళ వరద బాధితులకు తమవంతు ఆర్థిక సహాయాన్ని అందజేసినందుకు నేతాజీ హైస్కూల్ విద్యార్థులను, యాజమాన్యాన్ని ఎంఎల్‌సి లక్ష్మణరావు, పాఠశాల చైర్మన్ కె.తిరుపతి రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో నేతాజీ హైస్కూల్ డైరక్టర్స్ కె.రాజేష్, కె.దినేష్, శిరీష, లావణ్య, విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం



జగ్గయ్యపేట : తెలంగాణ రాష్ట్రంలోని కోదాడ పట్టణం నుండి జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి మారుతి సుజుకి సియాజ్ కారులో తరలిస్తున్న ఆరు కేసుల మద్యం 51.88 లీటర్ల పరిమాణం గల 288 బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. కోదాడ పట్టణం నుండి చిల్లకల్లు గ్రామానికి ఈ మద్యాన్ని తరలిస్తున్న చిల్లకల్లు గ్రామానికి చెందిన మల్లెల అనిల్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి మద్యం, ఫోన్ పే ద్వారా డబ్బులను పొందటానికి ఉపయోగిస్తున్న ఒప్పో స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇతని వెనకాల ఇతర నిందితులు ఎవరైనా ఉన్నారా అనేది తదుపరి దర్యాప్తులో తెలుతుందని జగ్గయ్యపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బి.ఆర్ అంబేద్కర్ గురుకులం విద్యాలయంలో 2024–25 సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో మిగులున్న సీట్ల భర్తీ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. ఐదో తరగతిలో ఎస్టి ఒకటి, బిసిసి 9, బిసి రెండు మొత్తం 12 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపిసిలో ఎస్‌టి ఇద్దరు, బిసిసి నాలుగు, బిసి, ఒసి ఒకటి చొప్పున మొత్తం ఎనిమిది సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. బైపిసిలో ఎస్‌సి నాలుగు, ఎస్‌టి రెండు, బిసి సి ఐదు, బిసి రెండు మొత్తం 13 సీట్లు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేసేందుకు విద్యార్థుల నుండి ఈ నెల 27వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ఖాళీలను భర్తీ చేయటంలో సంబంధిత కేటగిరికి చెందిన వారి నుండి దరఖాస్తులు రాకపోతే ఎస్‌సి కేటగిరికి చెందిన విద్యార్థులతో భర్తీ చేస్తామని, కాబట్టి ఎస్‌సి కేటగిరి విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. కావున ఆసక్తి గల విద్యార్థులు తమ దరఖాస్తులను ఐదో తరగతిలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపల్ కోటిరెడ్డి తెలిపారు.

వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ మానవహారం



ప్రజాశక్తి వత్సవాయి : కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తూ మక్కపేటలో పలు విద్యా సంస్థల విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో గ్రామంలోని గవర్నమెంట్ స్కూల్, శ్రీ సాయి సెంచరీ హైస్కూల్, ఎంఆర్‌టి కాలేజీ విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్వహించి కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తూ దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లెల శివప్రసాద్, జిల్లా పరిషత్తు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చింతల వెంకటేశ్వరావు, శ్రీ సాయి సెంచరీ హైస్కూల్ కరెస్పాండెంట్ కొమరగిరి భరద్వాజ్, ప్రిన్సిపాల్ కొమరగిరి సవిత గ్రామ పెద్దలు కొల్లిపర యజ్ఞ నారాయణ శర్మ, అధ్యాపకులు, సచివాలయం సిబ్బంది, మక్కపేట యూత్ నాయకులు గూడెపు అంజి, బాణావత్ సుబ్బారావు, యాంద్రాతి నరేష్, కత్తి విజయ్, అజ్మీర్ కిరణ్, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భవానీపురం : అనారోగ్యంతో మరణించిన బిజెపి కార్యకర్త పిళ్లా దుర్గారావు కుటుంబానికి ఎంఎల్‌ఏ సుజనా చౌదరి ఆదేశాలతో శనివారం ఆర్థిక సాయం అందించారు. ఎంఎల్‌ఏ కార్యాలయ సిబ్బంది 48వ డివిజన్ బిజెపి అధ్యక్షులు దేవిన హరి ప్రసాద్‌తో కలిసి పరామర్శించారు. ఎంఎల్‌ఏ కార్యాలయ సిబ్బంది శనివారం నగదును అందజేశారు.

గుంతను పూడ్చారు

ప్రజాశక్తి వార్తకు స్పందన...



ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ నియోజక వర్గంలోని భవానీ పురం చర్చి నుండి స్వాతి థియేటర్‌కు వెళ్లు క్రాంబ్వే రోడ్డు ప్రధాన రహదారిలోని రామరాజు కాటన్ షోరూం సమీపంలో ఏర్పడిన గుంతను శనివారం విఎంసి అధికారులు పూడ్చివేత పనులు చేయించారు. ఈ నెల 23వ తేదీన 'గుంతను పూడ్చురు' అనే కథనం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన నేపథ్యంలో స్థానిక 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి స్పందించి సర్కిల్–1 ఈఈ అధికారి దృష్టికి తీసుకువెళ్లి క్రాంబ్వే రోడ్డు మధ్యలో ప్రమాదభరితంగా ఉన్న గుంతను శనివారం పూడ్పించారు.

చేనేత,హస్త కళాకారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : చేనేత హస్తకళాకారుల ప్రోత్సాహకానికి సమర్థ ప్రత్యేక కార్యక్రమం ద్వారా చేతి వృత్తుల వారికి తగిన విధంగా సహకారం అందిస్తున్నట్లు ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ కార్యక్రమ ప్రతినిధి కె.ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు. నగరంలోని చేనేత సంస్థ ప్రదర్శన సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. కళాకారులు, చేనేత కార్మికులు, మహిళలు, గ్రామీణ పారిశ్రామిక వేత్తలకు సాధికారత కల్పించే కార్యక్రమం సమర్థ్ అన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభించి ఐదు సంవత్సరాలు అయ్యిందని నేటికి విజయవంతంగా జరుగుతుందన్నారు. కొంత మంది చిన్నగా పరిశ్రమలు, స్వయం సహాయక గ్రూపుల ద్వారా వ్యాపారాన్ని కూడా అభివృద్ధి చేసుకునే విధంగా చిన్న చిన్న యూనిట్లను ప్రారంభిస్తున్నారని తెలిపారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనార్థం శ్రీ అమ్మవారి ఆలయానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడి ఘంటం నరసింహ విచ్చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ శనివారం ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనము కల్పించారు. అనంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

26న భగవద్గీత పోటీలు

ప్రజాశక్తి - మైలవరం : శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని లైన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో ఈ నెల 26న స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భగవద్గీత పోటీలు నిర్వహిస్తున్నట్లు లైన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షులు శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతులుంటాయన్నారు.

దొంగతనాల నివారణపై అవగాహన

జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాల్లో దొంగతనాలు జరుగుతున్నాయని అవగాహన కల్పిస్తూ చిల్లకల్లు ఎస్ఐ సూర్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధి గ్రామాల్లో మండల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా మైకు ఏర్పాటు చేసి గ్రామాల్లో టామ్‌టామ్ లు వేయించి కరపత్రాలు ఆటోకు, గోడలకు అంటిస్తున్నారు. అనుమానమైన వ్యక్తులు కనిపించిన యెడల పోలీస్ వారికి తెలియజేయాలని కోరారు.

నేటి నుండి జీ తెలుగులో ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ప్రేక్షకులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తున్న జీ తెలుగు ఛానల్‌లో ఈనెల 25వ తేదీ నుండి ప్రతిరోజూ వివిధ కార్యక్రమాలతో పాటు సీనియర్స్ నూతనంగా అందిస్తున్నట్లు ఛానల్ రీజనల్ ప్రతినిధి కె.ప్రతాప్ తెలిపారు. నగరంలోని ఛానల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు. ప్రతి వారం సోమవారం నుండి శనివారం వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సీనియర్స్, ప్రత్యేక కార్యక్రమాలుంటాయని తెలిపారు. ఎంటర్‌టైన్ మెంట్ కార్యక్రమాలను కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు.



అసంపూర్తిగా ఉన్న ఆస్పత్రి భవనం

అసంపూర్తిగా ఆసుపత్రి భవనం

- బిల్లులు రాక పనులు నిలిపేసిన కాంట్రాక్టర్ • తాత్కాలిక భవనంలో రోగులకు అరకొర సేవలు • వర్షం వస్తే బురదమయం

ప్రజాశక్తి-గన్నవరం (హనుమాన్ జంక్షన్) : వైసీపీ ప్రభుత్వం నిధులు సమకూర్చకపోవడంతో బాపులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణ పనులు నాలుగేళ్లుగా కొనసా..గుతున్నాయి. పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలతో పీహెచ్సీలను అందుబాటులోకి తెస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణానికి సంబంధించిన పీహెచ్సీ భవన నిర్మాణానికి బిల్లులు చెల్లించక పోవడంతో పనులు ముందుకు సాగలేదు. కాంట్రాక్టరుకు దాదాపు రూ.50 లక్షలు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేసినట్లు సమాచారం. గత నాలుగేళ్లుగా భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసింది. మండల కేంద్రంలో ఉన్న పీహెచ్సీ పాత భవనం శిథిలా వస్థకు చేరడంతో 2020లో నాటి వైసీపీ ప్రభుత్వం నాడు- నేడు కార్యక్రమం నిధులు మంజూరు చేసింది. మైలవరం ఆర్అండ్ బీ అధికారులు పర్యవేక్షణలో నూతన పీహెచ్సీ పను లు 2021 ఫిబ్రవరిలో ప్రారంభించారు. పాత భవనాన్ని తొలగించి దాని స్థానంలో కొత్త భవన నిర్మాణం చేపట్టారు. 2021 అక్టోబరు నాటికి పనులు పూర్తికావాల్సి ఉంది. నత్తనడకగా పనులు సాగాయి. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో అధికారులు కూడా శ్రద్ధ పెట్టలేదు. దీంతో పీహెచ్సీ భవన నిర్మాణం గత ఏడాదిలో ప్లాస్టింగ్ వరకు చేసి నిలిచిపోయింది. గత ఐదేళ్లు పీహెచ్సీ ఆవరణలో హెూమియో వైద్య సేవలు కోసం ఏర్పా టు చేసిన పాత భవనాన్ని వైద్య సిబ్బంది వినియోగిస్తూ వస్తున్నారు. అదీ కూడా బాగా లోతట్టు ప్రాంతంలో నిర్మాణం చేయడంతో కొద్దిపాటి వర్షం కురిస్తే భవనం చుట్టూ మురుగు నిలిచిపోయి ఇబ్బందిగా మారుతోంది. రోగులకు కూడా అరకొరగా వైద్యసేవలు అందుతున్నాయి. మండల కేంద్రంలో అన్ని సౌకర్యాలతో సేవలు అందిం చాల్సిన పీహెచ్సీ భవన నిర్మాణంపై ప్రజాప్రతి నిధులు కూడా పట్టించుకోలేదు. గత ప్రభుత్వం పీహెచ్సీ భవన నిర్మాణంతో పాటు వెల్నెస్ సెంటర్లుకు సొంత భవనాలు ఏర్పాటు, వాటి నిర్వహణలో తీవ్ర అలసత్వం ప్రదర్శించింది. దీంతో ప్రజలకు వైద్యసాయం ఎండమావిగానే మారింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించు కుని పీహెచ్సీ భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



సిసి కెమెరాలకు అడ్డుగా ఉన్న కటౌట్లు

నిఘా నేత్రాలకు బ్యానర్లు అడ్డు

ప్రజాశక్తి-మొవ్వ : కూచిపూడి సెంటర్లోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు నిలువెత్తు కటౌట్లు అడ్డుపెట్టడంతో నిఘానేత్రాలు ఉన్నా లేనట్లుగా ఉంది. అనేక ప్రమాదాలను కనిపెట్టడంలో (హిట్ అండ్ రన్స్)ఈ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతుంటాయి. అలాగే సెంటర్లో శాంతి భద్రతల పర్యవేక్షణకు సహకరి స్తున్నాయి. అలాంటి నిఘా నేత్రాలకు కటౌట్లు అడ్డుపెట్టి తొలగించకపోవడంతో పర్యవేక్షణ కొరవడుతోందని పలువురు పెదవి విరుస్తున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రేపు 'మీకోసం' రద్దు : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఈనెల 26వ తేదీ సోమవారం "కృష్ణాష్టమి" ప్రభుత్వ సెలవు కారణంగా 'మీకోసం' పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున జిల్లా ప్రజానీకం ఈ విషయం గమనించాలని జిల్లా కలెక్టర్ కోరారు.



మాట్లాడుతున్న నాయకులు
ఆర్సిపి రెడ్డి, నీలం మురళీకృష్ణారెడ్డి

చివరి భూముల వరకు సాగు నీరందించాలి

ప్రజాశక్తి-పెదపారుపూడి : చివరి పొలాల వరకు సాగునీరు అందేలా కృషి చేయాలని కౌలు రైతు సంఘం నాయకులు ఆర్సిపి రెడ్డి, నీలం మురళీకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పాములపాడు , దూ ళ్ళవాని గూడెం, లంక కాలువ కింద ఆయకట్టు మూడు వందల ఎకరాలు చివర భూముల వరకు నీరు అందటం లేదని కౌలు రైతులు చేగుంటే రాజేష్ కౌలు రైతు సంఘ నాయకులు దష్టికి తీసుకురాగా ఆర్సీపీ రెడ్డి మురళీకష్ణ రెడ్డి పొలాలను పరిశీలించారు. అనంతరం ఆర్సిపి రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు సాగునీటి సమస్యను వెంటనే పరిష్కంచాలని కోరారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-బంటుమిల్లి : కొమ్మారెడ్డి పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ముందస్తుగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా ఎల్కెజి నుండి 2 వ తరగతి వరకు గల విద్యార్థిని, విద్యార్థులు శ్రీ కష్ణుడు, గోపికల వేషధారణలో అందరిని అలరించారు. 3 వ తరగతి విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఎన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకి చదువుతో పాటు మన పండగలు, సంస్కృతి, సంప్రదాయాలు తెలియచేయాలనే ఉద్దేశ్యంతో ఇటువంటి వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పాఠశాల పిఇటి కె. శ్రీనివాసరావు, ప్రీ- ప్రైమరీ ఇంచార్జ్ పి. వెంకట లక్ష్మి ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవి అకాడమీ స్కూల్లో : కోడూరులోని జీవి అకాడమీ స్కూల్లో శనివారం శ్రీ కష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకష్ణుని, మరియు గోపికల వేషధారణలతో అందరినీ అలరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవి అకాడమీ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో శ్రీకష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ చదువుతోపాటుగా మన సాంప్రదాయాల్ని గౌరవించాలన్నారు. కృష్ణుడి ప్రతిమను ఊయలలో ఉంచి కృష్ణాష్టమి నిర్వహించారు. చిన్నారులను కష్ణుడు, గోపికల వేషధారణలతో అలంకరించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొమ్మారెడ్డి స్కూల్లో...



జీవి అకాడమీ స్కూల్లో ...



చల్లపల్లిలోని చైతన్య పాఠశాలలో...

యోగా శిక్షకులకు దరఖాస్తులు ఆహ్వానం



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక ప్రభుత్వ హెూమియో డిస్పెన్సరి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో యోగా శిక్షకులుగా పనిచేసేందుకు ఆసక్తి కలిగిన పురుషులు, మహిళల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక వైద్యుడు డాక్టరు.నాగేంద్ర రావు తెలిపారు. యోగా శిక్షకులుగా పనిచేసేవారు పిజి యోగ లేదా డిప్లమో యోగలో అనుభవం ఉన్నవారు అర్హులనీ వారికి ప్రాధాన్యత ఏఎన్ఎం నిబంధనల ప్రకారం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. గౌరవ వేతనం గంటకు రూ. 250 చొప్పున పురుష యోగ శిక్షకుడుకు 32 గంటలు (నెలకు), మహిళా యోగ శిక్షకురాలుకు 20 గంటలు (నెలకు) నిర్ణయించినట్లు తెలిపారు. కావున శిక్షకులుగా విచ్చేసే వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8886610088 ఈ సెల్ నెంబర్ లో సంప్రదించాలని వైద్యాధికారి నాగేంద్ర రావు కోరారు.

వెండి పళ్లెం బహూకరణ

ప్రజాశక్తి మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి హైదరాబాద్ వాస్తవ్యులు కొల్లి రామ సుబ్బారెడ్డి శనివారం స్వామిని దర్శించుకుని 998 గ్రాముల బరువు కలిగిన వెండి పళ్లెం ను (సుమారుగా ఒక లక్ష రెండు వేల రూపాయలు) స్వామివారికి కానుకగా అందించారు. వెండిపళ్లెంను ఆలయ డిప్యూటీ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావుకి అందజేయగా దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి, ప్రసాదాలను అందించారు.



వెండిపళ్లెం బహూకరిస్తున్న దృశ్యం

భూయజమాని సంతకం నిబంధనలు తొలగించాలి

- కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు



మాట్లాడుతున్న ఎం. హరిబాబు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : కౌలు గుర్తింపు కార్డుకు(సి సి ఆర్ సి) భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులందరికీ పంట ఈక్రాప్ నమోదు చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు అన్నారు. శనివారం తోట్లవల్లూరులో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కౌలు గుర్తింపు కార్డు కోసం భూ యజమాని సంతకం నిబంధన పెట్టడం వలన, సంతకం పెట్టటానికి భూ యజమానులు ఎవరు ముందుకు రాకపోవడం వలన వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు ఏవి వర్తించడం లేదని ఆయన ఆవేదన చెందారు. కొత్తగా వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం అయినా కౌలు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానం నిలబెట్టుకుని, పంట వేసిన వాస్తవ సాగుదారులను ఈక్రాప్ నమోదు చేయాలని కౌలు గుర్తింపు కార్డు కోసం భూ యజమాని సంతకం నిబంధన తొలగించాలని, అప్పుడే కౌలు రైతులకు కొంతమేరకైనా న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, అధ్యక్షులు కే. శివ నాగేంద్రం, ఉపాధ్యక్షురాలు ఏ. శైలజ, ఎ. నాగేశ్వరరావు, రావులపల్లి వాసు, బెల్లపు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - మైలవరం : నేషనల్ స్పేస్ డే సందర్భంగా స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి అనిమి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి వి.ఉమా లక్ష్మీ ఆధ్వర్యంలో శనివారం నేషనల్ స్పేస్ జెడ్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇల్లా రవి నేషనల్ స్పేస్ డే ప్రాముఖ్యతను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.రంగారావు, జె.రాముడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఐలు బాధ్యతలు స్వీకరణ



ఎస్ఐ కె.సుధాకర్

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం ఎస్ఐగా కె.సుధాకర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా సుధాకర్ మైలవరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరిం చారు. మండల పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే పోలీసులకు సమా చారం అందజేయాలని సూచించారు.



ఎస్ఐ రాజు

కంచికచర్ల : కంచికచర్ల ఎస్ఐగా బొనగిరి రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రాజు కంచికచర్లకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ. పనిచేసిన ఎస్ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం కృష్ణాజిల్లా చల్లపల్లి పోలీసుస్టేషన్‌కు బదిలీపై వెళ్ళారు.

తిరువూరు సెక్టార్-2 ఎస్ఐగా వెంకట్రావ్



ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పోలీస్‌స్టేషన్ సెక్టార్ 2 ఎస్ఐగా వి.వెంకట్రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ గుణదల పోలీస్ స్టేషన్ నుండి సాధారణ బదిలీల్లో భాగంగా తిరువూరు పట్టణ పోలీస్ స్టేషన్‌కి బదిలీపై వచ్చారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కంచికచర్ల : జాతీయ మానవహక్కుల, నేర నియంత్రణ బ్యూరో వారి సహకారంతో, విజయవాడ మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో కంచికచర్ల. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ వేల్పుల సునీత వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల, నేర నియంత్రణ బ్యూరో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ భవానీ పురాణం, పద్మజ మాట్లాడుతూ మా సంస్థల ద్వారా పలు గ్రామాల్లో ఉచితంగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి నిరుపేదలకు ఉచితంగా వైద్య సదుపాయాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 60 మంది కంటి పరీక్షలు నిర్వహించి, కళ్ళ జోళ్ళు కావలిసిన వారికి విజయవాడ మాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి హాస్పటల్‌కు సిఫార్సు చేయడం జరిగిందని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై సర్వే

ప్రజాశక్తి - గంపలగూడెం : జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు తునికిపాడు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సీజనల్ వ్యాధులపై వైద్య బృందం ఆరా తీసింది. ఈ సర్వేలో ప్రస్తుతం జ్వరాన పడ్డ వారు లేరని, పూర్వం జ్వరం వచ్చి, తగ్గిపోయిన కొందరికి కీళ్ల నొప్పులు, వాపులు, తలనొప్పి తదితర సమస్యలు తమ దృష్టికి వచ్చాయని బృందం తెలిపింది. ఈ విషయమై అవసరమైన మందులు అందజేసి, గ్రామంలో పలుచోట్ల దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు బృందం వివరించింది. డాక్టర్ శృతి, ఊటుకూరు పరిధి వైద్య విస్తరణ అధికారి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.



బాలుడి అదృశ్యం.. 2 గంటల్లో ఛేదించిన పోలీసులు



ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆడుకుంటూ ఇంట్లో నుంచి బయటికి వెళ్లి అదృశ్యమైన ఓ బాలుడిని టూటౌన్ పోలీసులు రెండు గంటల్లో కుటుంబ సభ్యులకు అప్పగించి ప్రశంసలు అందుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... పాతబస్తీ మహంతిపురానికి చెందిన ఓ బాలుడు తన పిన్ని వద్ద నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం పిన్ని పనుల నిమిత్తం బయటకు వెళ్ళటంతో బాలుడు ఆడుకోవటానికి సుమారు 9.30 గంటల సమయంలో బయటకు వెళ్ళాడు. కొద్ది సేపటికి తర్వాత కనిపించలేదు. వారు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు శనివారం ఉదయం 11 గంటలకు ఫిర్యాదు చేశారు. సిఐ సి.కొండలరావు తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టగా మహంతిపురం ప్రాంతంలోని ఓ దేవాలయం సమీపంలో ఆడుకుంటూ ఉండగా పోలీసులు గుర్తించి బాలుడ్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విటిపిఎస్ కూలింగ్ కెనాల్‌లో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: వీటిపిఎస్ కూలింగ్ కెనాల్‌లో శనివారం మృతదేహం లభ్యమయింది. ఈ మృతదేహం ఇబ్రహీంపట్నం కాజీమాన్యంలో నివాసం ఉంటున్న ఉయ్యాల కోటేశ్వరరావుది (39)గా గుర్తించారు. స్థానికుల కథనం ప్రకారం ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో పండ్ల వ్యాపారం చేసే ఈయనకు ఇద్దరు సంతానం ఉన్నారు. ఉదయం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీళ్లలో పడి మరణించి ఉండవచ్చని భావిస్తున్నారు.కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఎ.చంద్రశేఖర్ తెలిపారు.

రూ.1.63 కోట్లతో గిరిజన గురుకుల విద్యాలయంలో వసతులు



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - విసన్నపేట : కొండపర్వ గ్రామం ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో రోటరీ క్లబ్స్, కీట్స్ ఆధ్వర్యంలో డిజిటల్ తరగతి గది, మౌలిక సదుపాయాలకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా కీట్స్ మేనేజింగ్ ట్రస్ట్ సభ్యులు వైఎస్.సుబ్రహ్మణ్యం, రోటరీ క్లబ్ జిల్లా కార్యదర్శి యడ్ల పార్థసారధి మాట్లాడారు. డిజిటల్ తరగతి గదుల ఏర్పాటుకు గ్లోబల్ గ్రాంట్ తరపున రూ.80 లక్షలతో రోటరీ క్లబ్ విజయవాడ, మిడ్‌టౌన్ రోటరీ బిల్డింగ్ గేమ్ యుఎస్ఎ ద్వారా నగదును సమకూర్చినట్లు ఈ తరగతి గదుల్లో కంప్యూటర్ ల్యాబ్, స్టెమ్ ల్యాబ్, చదువులకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ నుంచి సిఎస్ఆర్ నిధుల తరపున 83 లక్షలు కీట్స్ ద్వారా ఇచ్చినట్లు తెలిపారు. ఈ నిధులతో స్కూలు, కాలేజీ సిబ్బందికి మరుగుదొడ్లు, కోతులు రాకుండా గ్రిల్స్ ఏర్పాటు, సోలార్ పవర్, ఇంటర్నెట్ సౌకర్యాలు, తదితర వసతులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మొత్తం రూ.1.63 కోట్లు ఈ స్కూలు, కాలేజీలో సదుపాయాల సౌకర్యాల నిమిత్తం మాత్రమే ఉపయోగించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ మిడ్‌టౌన్ సెక్రెటరీ కోనేరు మధు, రోటరీ నూజివీడు ప్రెసిడెంట్ నరేంద్ర వై.రాజగోపాల్, ముల్లపూడి కృష్ణమోహన్, మూవీ కృష్ణారావు విద్యాలయ ప్రధాన అధికారులు రాము, స్వర్ణలత, కాంట్రాక్టర్ జి.సత్యనారాయణ, విద్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విజన్ ఉండాలి : కొలికపూడి



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొలికపూడి

ప్రజాశక్తి - విసన్నపేట : విద్యార్థులకైనా, వ్యాపారస్తులకైనా, రాజకీయ నాయకులకైనా విజన్ తప్పనిసరిగా ఉండాలని తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక వికాస్ కాలేజీలో విద్యార్థుల ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విజన్, ఇన్నోవేషన్, నాలెడ్జ్, ఆటిట్యూడ్ సక్సెస్ అనే వివరణ తెలుపుతూ ఈ లక్షణాలు అందరూ కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఇటీవల విసన్నపేట సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి మౌలిక వసతుల కల్పనకు నిధులు లేక ఆగిపోయిందని కరెస్పాండెంట్ నర్సిరెడ్డికి తెలుపగా తమ వంతు సహాయ సహకారాలు అందజేసేందుకు కృషి చేస్తామని చెప్పారని ఎంఎల్ఎ అన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐ గిరిబాబు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరువూరు : ఐడియాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో తిరువూరు బస్టాండ్ సమీపంలో గల ఎస్ఎంఎస్ ట్యూషన్ సెంటర్‌లో శనివారం బాలికల సాధికారత సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిఐ కె.గిరిబాబు మాట్లాడుతూ సెల్ ఫోన్ వల్ల జరిగే అనర్థాలను చెప్పారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని పెట్టుకొని దాని కోసం కష్టపడాలన్నారు. ఎంఇఒ ఎ.శ్యాంసుందర్ మాట్లాడుతూ గత వారం తిరువూరులో జరిగిన సంఘటన ఒక అమ్మాయిని బైక్ మీద తీసుకుని వెళ్లి అత్యాచారం చేసిన నిందితుడు జైల్లో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఉయ్యూరు అనసూయ, సంకురాత్రి జనార్దన్‌రావు, వాకదాని లక్ష్మీనారాయణ, సిస్టర్ జ్యోత్స్న, ఫెలిస్త, అవ్వారి శౌరి పాల్గొన్నారు. చింతగూడెం, కుప్పెనకుంట, మల్లెల చిట్యాల నుండి 60 మంది కిషోర్ బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలికలను చదవనిద్దాం వాల్‌పోస్టల్లను ఆవిష్కరించారు.

గణిత అధ్యాపక పోస్టుకు దరఖాస్తు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల బిఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలోని ఇంటర్మీడియట్ విభాగంలో గణితం బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ కోటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి పూర్తి తాత్కాలిక ప్రాతిపదికన గణిత శాస్త్రం బోదించే అధ్యాపకుడికి నెలకు రూ.24 వేలు వేతనం చెల్లించబడుతుందని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు, రెజ్యూమ్ ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ విద్యాలయంలో అందజేయాలని ప్రిన్సిపల్ తెలిపారు.

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు



కంచికచర్ల

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల శ్రీ అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ అక్షర స్కూల్ చైర్మన్ గడిపూడి శ్రీరామ్, కరెస్పాండెంట్ సెక్రటరీ రామారావు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు నిర్వహించారు. **కంచికచర్ల :** కంచికచర్ల ఉషోదయ స్కూల్‌లో నిర్వహించారు. బాలికలు గోపిక వేషధారణలో బాలురు శ్రీకృష్ణ వేషధారణలో అలరించారు. కరస్పాండెంట్ కుర్రా కిరణ్, డైరెక్టర్ కుర్రా హరీషా సిబ్బంది పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామ రైతు పేటలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ప్రిన్సిపల్ రమేష్, ఆర్ఐ వినోద్ ఏజీఎం మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. **జగ్గయ్యపేట :** పట్టణంలోని లిటిల్ ఏంజిల్ స్కూల్‌లో నిర్వహించారు. పాఠశాల కరెస్పాండెంట్ శ్రీరాం బద్రి నారాయణ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. గండ్రాయి మెయిన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **వత్సవాయి :** మక్కపేట గ్రామం లోని శ్రీ సాయి సెంచరీ హై స్కూల్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కరెస్పాండెంట్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్, ప్రిన్సిపాల్ కొమరగిరి సవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **తిరువూరు :** సిద్ధార్థ స్కూల్, నాగార్జున, శ్రీనిధి, గీతం పాఠశాలల్లో విద్యార్థులకు శ్రీకృష్ణ, గోపిక వేషధారణలో అలరించారు. పాఠశాలల అధినేతలు కె.నరసింహారావు, ఎం.కిషోర్, ఎస్.ఎన్.బి. చారి, ఉప్పలపాటి చక్రపాణి, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు వేడుకలను పర్యవేక్షించారు.

ముగిసిన 'బిజినెస్ క్విజ్'

ప్రజాశక్తి - వన్‌టౌన్: పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్)లో యం.బి.ఏ విభాగం వారు నిర్వహించిన "ప్రశ్నావల్లి" ఒక రాష్ట్ర స్థాయి బిజినెస్ క్విజ్ శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం నిర్వహించగా ముఖ్య అతిథిగా అపెక్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేందర్ కుమార్ సరణం, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.ఆర్.కె. వైద్యనాథన్ పాల్గొన్నారు. కళాశాల అధ్యక్షులు చలవాది మల్లికార్జునరావు, ప్రిన్సిపల్ డా. ఏ. పతంజలి శాస్త్రి, డిపార్ట్మెంట్ హెడ్ డా. విజయ దుర్గ ప్రసాద్, యం.బి.ఏ అధ్యాపకులు వివిధ కాళాశాల విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా నరేందర్ కుమార్ మాట్లాడుతూ ఈ బిజినెస్ క్విజ్ విద్యార్థుల వ్యాపార నైపుణ్యాలను, సృజనాత్మకతను ప్రోత్సహించడానికి ఒక మంచి వేదిక అన్నారు. బిజినెస్ క్విజ్లో విజేతలకు రూ.30 వేలు, రన్నర్‌కు రూ.15 వేలు, ప్రేక్షకులకు రూ.5 వేలు నగదు బహుమతి ప్రదానం చేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్, చిట్టా అమర్ సుధీర్, జాయింట్ సెక్రటరీ గ్రంధి పవన్ కుమార్, ట్రెజరర్ కాజా రాఘవయ్య పాల్గొన్నారు.

నేటి నుండి నేత్రదాన ప్రచార పక్షోత్సవాలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : 'స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు నేత్రదాన ప్రచార పక్షోత్సవాలు జరుగుతున్నాయి. భారత ప్రభుత్వం, ఐ బ్యాంక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఉన్న ఐ బ్యాంక్స్, నేత్రదానంపై ప్రచారం చేసే సేవా సంస్థలు ఈ ప్రచార పక్షోత్సవాల్లో సక్రియంగా పాల్గొంటున్నాయని స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సమరం శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ నెల 26న విజయవాడ నాస్తిక కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో పక్షోత్సవాల ప్రారంభ సభ జరుగుతుందని, 28న నేత్రదానంపై అవగాహన కలిగించే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు 29న నేత్రదానం ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు, 30న చిత్రలేఖనం పోటీలు, వచ్చే నెల 2న స్లోగన్ పోటీలు, 3న పాటల పోటీలు, 4న క్విజ్ పోటీ, 5న అంధ విద్యార్థులకు ఆటల పోటీలు ఉంటాయని, అందరూ పాల్గొనాలని కోరారు. నాస్తికకేంద్రంలో నిర్వహిస్తామన్నారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డా. బి.కీర్తి, మెడికల్ డైరెక్టర్ డా. పి.దీక్ష, డా.మారు, నియంత, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ ఆంధ్రప్రదేశ్ డాక్యుమెంట్ తయారీకి సిద్ధం కావాలి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ డాక్యుమెంట్ తయారీకి సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ 2047 డాక్యుమెంట్ తయారీపై జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 జిల్లా డాక్యుమెంట్ తయారు చేసి పంపాలని ఆదేశించిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 78 వేల కోట్ల రూపాయల ఉత్పత్తి ఉందని దీన్ని మరో 15 శాతానికి పెంచి ఆదాయం పెంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందుకోసం ఉత్పత్తులు వాటి ధరల పెరుగుదలకు వినూత్నంగా ఆలోచించాలన్నారు. ఈ నెల 27వ తేదీ మంగళవారం మండల స్థాయిలో డాక్యుమెంట్ తయారీపై కార్యశాల నిర్వహించాలన్నారు. ఇందులో ప్రతి ప్రభుత్వ శాఖకు చెందిన అధికారులతో పాటు రైతులు, ప్రజాప్రతినిధులను, రైతు సంఘాలు, చేనేత సహకార సంఘాలు, మత్స్య సహకార సంఘాలు తదితర సంఘాల ప్రతినిధులను భాగస్వాములు చేసి వారి నుండి సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య , చేనేత తదితర శాఖల ఉత్పత్తులు, వాటి విలువలు పెరిగేందుకు తద్వారా రైతులకు ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఇన్చార్జి డిఆర్ఓ శ్రీదేవి ,సి పి ఓ గణేష్, డి ఆర్ డి ఎ పి డి నాగేశ్వర్ నాయక్, జిల్లా పరిశ్రమల అధికారి వెంకట్రావు, ఏపీఐఐసీ జడ్ ఎం సీతారామయ్య పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక గుడ్లవల్లేరులోని వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ కళాశాలలో ఇన్నోవేషన్ ఇంటూ స్టార్ట్ అప్ (నూతన ఆవిష్కరణలను ప్రారంభ వ్యాపారాలుగా మార్చటం) అనే అంశంపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ డిఎన్వి శివరాం ప్రొప్రైటర్, స్టార్ ఫార్మసీ గుడివాడ నుండి విచ్చేసి మాట్లాడారు. సృష్టి, నవీకరణ ద్వారా వచ్చే కొత్త ప్రారంభాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ స్టార్ట్ అప్ యువతలో సృజనాత్మకతను పెంచుతూ దేశంలో ఆర్థిక ప్రగతిని పెంపొందిస్తాయని చెప్పారు. వ్యాపారంలో ఉన్నత స్థానానికి ఎదగాలంటే ఎన్నో కష్టాలను అధిగమించి అచంచలమైన కృషితో పాటు సాధించాలనే పట్టుదల వ్యాపార అభివృద్ధిని పెంచే నూతన ఆలోచనలను అలవర్చుకోవాలని విద్యార్థులను ప్రేరేపించారు.



ఈ సందర్భంగా. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ లక్ష్మణరావుతో పాటు ఇన్స్టిట్యూట్ ఇన్నోవేషన్ సెల్ ప్రతినిధి టి శ్రావణి, అధ్యాపకులు డాక్టర్ ఎస్ కే అమీనాభి, డాక్టర్ పి రవిష, డాక్టర్ టి.ప్రశాంతి, డాక్టర్ టి బాలకృష్ణ పాల్గొన్నారు.

బాలికలకు ఆటలు ప్రారంభం



ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈనెల 29న నిర్వహించబోయే జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శనివారం రెండో రోజు బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అవనిగడ్డ సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం గౌరవ అధ్యక్షులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు పాల్గొని ప్రారంభించారు. కబడ్డీ, చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కబడ్డీ విన్నర్స్‌గా ప్రభుత్వ ఉన్నత పాఠశాల రన్నర్స్‌గా జడ్పీ హైస్కూల్ తలకాడదీవి విద్యార్థులు నిలిచారు. చెస్ పోటీలలో అండర్ 17 విభాగంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని వి. భవ్య శ్రీ ప్రథమ స్థానం సాధించగా నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థిని ఎస్ హరిత ద్వితీయ స్థానం సాధించింది. అండర్ 14 విభాగంలో అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన వి ప్రజ్వల ప్రథమ స్థానం, ఎండి సలీమా తే సిస్దిచేస్తాను సాధించింది. ఈ పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిఎన్‌బి గోపాల్ పర్యవేక్షణలో వ్యాయామ ఉపాధ్యాయుల అవనిగడ్డ సబ్ జోన్ సంఘం అధ్యక్షులు కోసూరి పూర్ణచంద్రరావు, కార్యదర్శి జి మారుతి, ట్రెజరర్ మునగాల ఉదయ్ కుమార్ ఏడు మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడివాడ : ఎన్‌టిఆర్ స్టేడియం వాకర్ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియం సమీపంలో 200 మందికి అను గ్రూప్ ఆఫ్ హస్పటల్స్ వైద్య బందంతో ఉచితంగా బి.పి, సుగర్, గుండె పరీక్షలు ఇ.సి.జి, 2డి,ఎకో,కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్బంగా వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షలు లోయ ఈశ్వరవెంకటేశ్వరరావు మాట్లాడుతూ డా.ఖాన్ ,డా.రక్షిత, డా.శ్రీకాంత్ ,డా.సుజాత, డా. అజయ్‌లు ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్టు సహకారంతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కళ్లజోడు అవసరమైన వారికి తక్కువ ధర రూ.300 అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ గవర్నర్లు పర్వతనేని చంద్రశేఖర్, బొగ్గవరపు తిరుపతయ్య ,అధ్యక్షలు మెరుగుమాల శివరామకష్ణ, కార్యదర్శి కోన రామారావు, కోశాధికారి కొమరవోలు రామకష్ణ, సభ్యులు పొన్నూరు సత్యనారాయణ, లింగం చిట్టిబాబు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు కర్రీవేణు మాధవ్ ఆదేశానుసారం మచిలీపట్నంలోని స్తానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానం పైన గల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వైశ్య సమాజ మందిరంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పెంటా వెంకటరమణ అధ్యక్షతన శనివారం సమావేశం జరిగినది. ఈ సమా వేశంలో శ్రీ కామాక్షి మచిలీపట్నం స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మచిలీపట్నం సంఘ అధ్యక్షులుగా మానేపల్లి దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా బహు రోజుశేష బ్రహ్మం, కోశాధికారిగా వాసాబత్తుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. రాష్ట్ర,జిల్లా స్వర్ణకార సంఘం నాయకులు గడ్డం రాజు, షేక్ రబ్బాని, భోగాదుల సూరిబాబు, మానేపల్లి బ్రహ్మాజీ గాదె రమణ,దేవు కనక రత్నాచారి పాల్గొన్నారు.

ఉల్లిపాలెంలో 'పొలంబడి'

ప్రజాశక్తి-కోడూరు : రైతులకు వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేందుకు మంచి సూచనలు అందించడం కోసమే 'పొలంబడి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కోడూరు మండల వ్యవసాయ శాఖ అధికారి యం శ్రీధర్ తెలిపారు. శనివారం కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ పరమైన సాంకేతిక సూచనలు, ఖర్చు తక్కువ చేసి, అధిక దిగుబడులు వచ్చే విధంగా మేలైన ఎరువులు,పురుగు, కలుపు నివారణకు గల సలహాలు రైతులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దివిసీమ ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ అవనిగడ్డ సీఈఓ యం వినోద్, ఉల్లిపాలెం గ్రామ వ్యవసాయ అధికారిని పి నీలిమ, రైతులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి, మొవ్వ : గత కొంతకాలంగా మొవ్వ మండలం అయ్యంకి గ్రామం నుండి మొవ్వ గ్రామం వరకు వెళ్లే ప్రధాన రహదారి గోతులు గుంతలతో అస్తవ్యస్తంగా ఉండటం వలన ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా దానికి సంబంధించిన అధికారులతో మాట్లాడి దగ్గరుండి జెసిబి తో ఆర్ అండ్ బి రహదారి మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నన్నపనేని వీరేంద్ర, మొవ్వ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

148 మందికి కంటి పరీక్షలు


ప్రజాశక్తి-చల్లపల్లి : అంధత్వ నివారణకు లయన్స్ క్లబ్ కషి చేస్తోందని లయన్స్ క్లబ్ ఆఫ్ వీ.ఆర్.కే నగర్ అధ్యక్షులు రాయపాటి రాధాకష్ణ అన్నారు. శనివారం చల్లపల్లిలో క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వెంకట్రావ్ 148 మందికి పరీక్షలు చేసి 12 మందిని కంటి శుక్లముల ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శిబిరాన్ని క్లబ్ కార్యదర్శి కస్తూరి ప్రసాద్, మాజీ అధ్యక్షులు నర్రా సాయిబాబు, మోపిదేవి వెంకటేశ్వరరావు, ఏ.ఎల్.ఆర్.కే ప్రసాద్, డీ ధనుంజయరావు, ట్రెజరర్ ముమ్మనేని రాజకుమార్ (నాని), దాత కోసూరు శ్రీనివాస్ పర్యవేక్షించారు.

'ఏఎన్ఆర్' విద్యార్థులు పరిశ్రమ సందర్శన

ప్రజాశక్తి-గుడివాడ : పరిశ్రమలను సందర్శించడం వలన ఎంబిఎ విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ వస్తుందని ఏఎన్ఆర్. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్ అన్నారు. శనివారం నందివాడ మండలంలోని తమిరిశలోని ఉమా స్పిన్ టెక్స్ ఏఎన్ఆర్ కళాశాల ఎం.బిఎ విద్యార్థులు పరిశ్రమల నిర్వహణలో భాగంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వృతి నైపుణ్యాలు పెంపొదించుకోవడానికి ఇలాంటి సందర్శనలు ఉపయోగ పడతాయన్నారు. వస్తువుల తయారి, ప్యాకింగ్, అమ్మకాలు గురించి పూర్తి అవగాహన పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, ఎం.బి.ఎ. విభాగాధిపతి డాక్టర్ ఎం.బి. సువర్చల, ఎం.బి.ఎ. అధ్యాపకులు వి.నాగేంద్రకుమార్, ఎం.భరత్ కుమార్ పాల్గొన్నారు.

'మత్తు' అనర్థాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-గన్నవరం : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలోని శ్రీ లంకా వీరయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా శనివారం ఏర్పాటు చేశారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మాట్లాడుతూ మత్తుతో జీవితం శూన్యం అని, మత్తు పదార్థాల జోలికి వెళ్ళద్దు అని తెలిసో తెలియక మాదకద్రవ్యాలకు అలవాటు చేసుకుంటున్నారు అని, మత్తు పధార్థాలతో బతుకు దుర్భరం చేసుకోవద్దు అని సూచించారు. విద్యార్థి దశలో విద్యార్థులు ఒక్కసారి ధూమపానం, మద్యం సేవించడం, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కంగిపోతారన్నారు. చెడు అలవాట్లు అనేవి ఒకరు నుంచి ఒకరు అలవాటు పడి తీవ్ర ప్రమాదస్థాయికి చేరుకుంటారని, క్యాన్సర్, ఇతర ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులచే మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్స్ ఎస్‌కె నజ్మా, ఎస్. జాకబ్ రాజు, నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ డి విజయ రాణి, వీరవల్లి గ్రామ పంచాయితీ మహిళా సంరక్షణ కార్యదర్శి పి సోని పాల్గొన్నారు.



ముస్లిం సోదరులను సత్కరిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా

ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : వర్ల

ప్రజాశక్తి-పమిడిముక్కల : షాదీఖానా నిర్మాణం, ముస్లింల సంక్షేమం కోసం తెలుగుదేశం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని పామర్రు ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా అన్నారు. శనివారం పమిడిముక్కల మండలానికి చెందిన అలీనాకీ పాలెం ముస్లిం సోదరులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడు మైనారిటీలకు రంజాన్ తోఫా లాంటి పథకాలు ప్రవేశపెట్టి వారికి ఆర్థిక చేయూతనిచ్చిందన్నారు. ప్రభుత్వం అలినాకిపాలెం గ్రామాభివద్ధి కట్టుబడి ఉందన్నారు. హుస్సేన్ పంజా, పార్టీ గ్రామ అధ్యక్షుడ మగ్గు బుల్ హుస్సేన్, జక్కా శ్రీనివాసరావు ఆలీ అబ్బాస్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారుల నిర్మాణం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చొరవతో అంతర్గత రహదారుల అభివృద్ధి పనులు చేపట్టారు. శనివారం ఒకటో వార్డులోని ఆర్యవైశ్య కాలనీలో రెండు రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇందుకుగాను కాలనీలోని అపార్ట్మెంట్ వద్ద నుండి హరిత హాస్పటల్ వరకు ఉన్న రోడ్లో ప్రొక్లైన్తో జంగిల్ క్లియరెన్స్ చేశారు. విద్యుత్ శాఖ అధికారులు ఆయా వీధుల్లో దెబ్బతిన్న విద్యుత్ పాత స్తంభాలు తొలగించి నూతన స్తంభాలను ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ అధికారులు నూతన తాగు నీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఈ పనులను టిడిపి జన సేన నాయకులు ఎలవర్తి ఆది భూపతి శ్రీనివాసరావు, వహీదుల్ల తుంగల శ్రీనివాసరావు, కడవకొల్లు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కంకిపాడు : విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్న పెనమలూరు సెంటర్, కంకిపాడు గ్రామాల మధ్య వీధి దీపాలు ఏర్పాటు చేసి సామాన్య ప్రజల ప్రాణాలు కాపాడాలని కంకిపాడుకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు,ప్రముఖ సోషల్ వర్కర్ యలమంచిలి కిషోర్ బాబు కోరారు. ఈ మేరకు ఆయన జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ అధికారులకు లేక రాశారు.

గిరిజన తండాల్లో మరణమృదంగం

కిడ్నీ వ్యాధితో పాటు విషజ్వరాలు జిల్లాను చుట్టుముట్టాయి. కిడ్నీ వ్యాధి ముదిరి సరైన వైద్యం అందక, వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేక ఏ కొండూరు, గంపలగూడెం, తిరువూరు, విసన్నపేట తదితర మండలాల పరిధిలోని గిరిజన తండాలు, ఎస్సీ,ఎస్టీ కాలనీలలోని నిరుపేదలు, పేద, మధ్యతరగతి ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. అలాగే విషజ్వరాలతో ఇల్లంతా మంచమెక్కింది. ఒక్కొక్క ఇంట్లో ఇద్దరు, ముగ్గురు జ్వరాలతో అల్లాడిపోతున్నారు. క్షీణించిన పారిశుధ్యం, కలుషిత నీరు, సరైన వైద్యం అందుబాటులో లేక, ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో సిలికాన్, ఫ్లోరైడ్ కలిసిన విషతుల్యమైన భూగర్భ జలంను తాగుతున్నందున గ్రామాలకు గ్రామాలే మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి విషజ్వరాలతో అల్లాడిపోతున్నా... రాష్ట్ర ప్రభుత్వంలో కానీ... అధికారుల్లో ఎటువంటి చలనం ఉండటం లేదని ఆయా గిరిజన తండాల్లోని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి దయనీయ పరిస్థితి గత వారం, పది రోజులపాటు సిపిఎం నిర్వహించిన సర్వేలో వెల్లడయింది. తిరువూరు, మైలవరం తదితర నియోజకవర్గాల పరిధిలోని పదుల సంఖ్యలో గ్రామాల్లో కిడ్నీ వ్యాధితో మృత్యువాతపడుతున్నారు.

తండాల్లో మోగుతున్న మరణమృదంగం...

ఈ పదేళ్ల నుండి వందల సంఖ్యలో గిరిజన తండాల్లోనే గాక, ఇతర గ్రామాల్లోని ప్రజలు కిడ్నీ వ్యాధితో మృతి చెందుతున్నారు. ఈ ప్రాంతాల్లోని భూగర్భజలంలో సిలికాన్, ఫ్లోరైడ్ అత్యధికంగా ఉంటుంది. ఇటువంటి

వీక్షణం

నీటిని తాగుతున్నందున మనిషి కిడ్నీలపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. సాధారణంగా పురుషుల్లో 1.3 ఎంజి, మహిళల్లో 1.1 ఎంజి లోపు క్రియాటిన్ శాతం ఉంటే ఎటువంటి ఇబ్బంది ఉండదు. కానీ గిరిజన తండాల్లోని భూగర్భజలం (బోర్‌వాటర్)ను తాగుతున్న వారిలో క్రియాటిన్ శాతం రెండు ఎంజి నుంచి 13-14 ఎంజికి పైగా ఉండటం కారణంగా వెంటనే కిడ్నీలపై ప్రభావం చూపి, వెంటనే అవి దెబ్బతింటున్నాయి. దీని వల్ల చూపు మందగించడం, కాళ్లు చచ్చుబడిపోవడం, నీరసం, గుండెపై, ఇతర పలు రకాలుగా ప్రభావం చూపి చనిపోతున్నారు. కిడ్నీ వ్యాధి గ్రస్తులను ఆదుకోవాలని కోరుతూ శనివారం సిపిఎం నిర్వహించిన ధర్నాకు ఆయా గ్రామాల నుంచి కిడ్నీ రోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కిడ్నీ వ్యాధితో గత మూడు సంవత్సరాల నుంచి కళ్లు మసగా ఉండి, చూపు మందగించిందని, కంటి ఆపరేషన్ చేయించుకోవడానికి డబ్బులు లేక, ప్రభుత్వం నుంచి సాయం అందడం లేదని కొండూరు తండాకు చెందిన భూక్య ఆదియ్య చెప్పి, ఆవేదన వ్యక్తం చేశాడు. కళ్ల మసకతో ఎదుటి వారిని గుర్తించలేకపోతున్నానని, పనికి వెళ్లలేక, కుటుంబం కూడా గడవలేని దయనీయ పరిస్థితిలో ఉన్నామని అన్నాడు. కిడ్నీ వ్యాధితో నెలకు ఎనిమిది వేలు ఖర్చుఅవుతుందని తెలిపారు. నాలుగేళ్ల నుండి కిడ్నీ సమస్యతో కళ్లు సరిగా కనిపించక తీవ్ర అవస్తలు పడుతున్నట్లు భూక్యా అర్జునరావు తెలిపాడు. కిడ్నీ వ్యాధి ముదిరి కాళ్లు సచ్చు పడ్డాయని బి.బాలోజి అన్నారు. నెలకు రూ.పది వేలు వైద్యం ఖర్చు ఉందని, 15 సంవత్సరాల నుంచి జబ్బుతో అల్లాడిపోతున్నట్లు ప్రభుత్వం ఇచ్చే రూ.నాలుగు వేలు ఏమాత్రం సరిపోవడం లేదని తెలిపారు. క్రియాటిన్ 13 ఎంజికి పెరగడంతో కోమాలోకి వెళ్లానని, 2021లో విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం చేయించు కున్నానని, చావు నుంచి బయటపడినప్పటికీ తీవ్ర అవస్థలు పడుతున్నట్లు కె.కొండలరావు కన్నీటి పర్యంతమయ్యాడు. కృష్ణానది నీటిని అందించి కిడ్నీ వ్యాధి నుంచి ప్రజలను కాపాడాలని బాధితులు కోరుతున్నారు.

- రాజు

ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : 'మమ్మల్ని పట్టిపీడిస్తున్న కిడ్నీ రోగాలకు వైద్యం చేయించుకునే స్థోమత లేదు. ఇప్పటికే వైద్య ఖర్చులకు ఉన్న ఎకరం, అరెకరం భూములను అమ్ముకున్నాం. ప్రభుత్వం ఆదుకుంటే కొంతకాలం బతకాలని ఉంది' అని కిడ్నీ రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. కిడ్నీ రోగులను ప్రభుత్వం ఆదుకోవాలని శనివారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కిడ్నీ రోగులు బాబూరావుకు తమ ఆవేదనను చెప్పుకున్నారు.

15 సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో : బర్మావత్ బాలాజీ మత్రియ తండ



బాధితునితో మాట్లాడుతున్న బాబూరావు

'15 సంవత్సరాల క్రితం నాకు కిడ్నీ వ్యాధి సోకింది. అప్పటినుండి ఇప్పటివరకు విజయవాడలోని విజయ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నాను. నెలకు నా వైద్యానికి పదివేల వరకు ఖర్చువుతుంది. నాకు ఇద్దరు కుమారులు. ఒక కుమారుడు వికలాంగుడు, రెండో కుమారుడు కూలి పనులు చేసుకుని బతుకుతున్నారు. నాకు, నా కుమారుడికి వచ్చే పెన్షన్‌తోనే వైద్యం చేయించు కుంటున్నాను.. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాను'

తొమ్మిదేళ్లుగా ఇంటికే పరిమితం : జరబల గోపి , పెద్ద తండా



'9 సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని విజయ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటూ ఇంటికే పరిమితం అయ్యాను. నా పిల్లలకు నేను భారంగా మారాను. మంచానికే పరిమితం అయిన నాకు ప్రభుత్వం పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నాను.'

నేనూ నా భర్త కిడ్నీ రోగులమే : గడ్డం ఆదం రత్తమ్మ, గొల్లమందల



'నేను నా భర్త కిడ్నీ వ్యాధితో మంచం పట్టాము. నా భర్తకు నాలుగు సంవత్సరాల నుండి కిడ్నీ వ్యాధికి విజయవాడలోని కైరాన్ కిడ్నీ కేర్ సెంటర్లో వైద్యం చేయిస్తున్నాను. సంవత్సరం క్రితం నాకు కూడా కిడ్నీ వ్యాధి వచ్చింది. నేను తిరువూరులోని ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నాను. మా ఇద్దరికీ నెలకు రూ.15 వేలు ఖర్చవుతుంది'

రెండేళ్లు డయాలసిస్ చేయించుకుంటున్నా : భరోతు రాముడు, వెంకట తండ



'ఏడు సంవత్సరాల క్రితం నాకు కిడ్నీ వ్యాధి వచ్చింది. రెండు సంవత్సరాల నుండి డయాలసిస్ చేయించుకుంటున్నాను వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నాను. డయాలసిస్ ఉచితంగానే చేస్తున్న విజయవాడహాస్పటల్లో వైద్య పరీక్షలు, మందులకు నెలకు రూ.12 వేలు ఖర్చవుతోంది'

ట్రిపుల్ ఐటికి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థిని



ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వెల్లంకి ప్రశాంతి ఒంగోలు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రధానో పాధ్యాయురాలు ధర్మశీల తెలిపారు. పదోతరగతిలో సాధించిన మార్కులను ఆధారంగా చేసుకొని ఈ సీటు వచ్చినట్లు తెలిపారు. ఎంపిక్కైన విద్యార్థిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

26 నుంచి జాతీయ క్రీడాదినోత్సవ పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈ నెల 29వ తేదీన మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా నిర్వహించే జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా కలెక్టర్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు క్రీడలతో పాటు క్విజ్, వాసరచన తదతర అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఎ అజీజ్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారమిక్కడ ఓ ప్రకటన విడుదల చేశారు. పోటీలను పాఠశాలలు, కళాశాలలతో పాటు జిల్లాస్థాయిలో ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వాక్/రేస్, వాలీబాల్, హాకీ, మినీ ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, చెస్, బాక్సింగ్, జూడో, వెయిట్ లిఫ్టింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. విజేతలకు బహుమతులతో పాటు ఐజిఎం స్టేడియంలో సత్కరించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు అర్హతలు, ఇతర వివరాలకు 9494481669 ఫోన్ నంబర్‌లో సంప్రదించొచ్చని ఎస్ఎ అజీజ్ తెలిపారు.



బాస్కెట్‌బాల్ విజేత 'కెబిఎన్'

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఈ నెల 20వ తేదీ నుంచి 22 వరకు మెరిస్టెల్లా కళాశాల విజయవాడలో జరిగిన ఉమ్మడి కృష్ణా జిల్లా ఇన్విటేషన్ బాస్కెట్బాల్ పోటీల్లో తమ కళాశాల పురుషుల జట్టు ద్వితీయ స్థానాన్ని చేజిక్కించుకుందని ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో క్రీడాకారులకు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ తమ కళాశాల ఫైనల్స్‌లో వర్ష కారణంగా మధ్యలో ఆగిపోయిన ఆటకు టాస్ ద్వారా ద్వితీయ స్థానం దక్కించుకోవాల్సి వచ్చిందని తెలిపారు.. క్రీడాకారులను. వారికి శిక్షణ ఇచ్చిన కళాశాల క్రీడా విభాగాధిపతి డి హేమచంద్రరావుని అభినందించారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి తమ కళాశాల యాజమాన్యం క్రీడలకు ఉన్నత స్థానాన్ని ఇస్తుందని తెలియజేస్తూ విజేతల్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.ఎల్. రమేష్, డాక్టర్ కే.రామకృష్ణ తదితరులు వీరిని అభినందించారు.

హీరో గ్లామర్ 2024 ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : యువతను ఆకట్టుకునేలా ఎప్పటికపుడు వినూత్నంగా నూతన బైక్‌లను అందిస్తున్న హీరో మోటార్స్ నుండి సరికొత్తగా హీరో గ్లామర్ -2024 ద్విచక్ర వాహనం మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ బిజినెస్ ఆఫీసర్ రంజీవ్ జిత్ సింగ్ తెలిపారు. ఎంజి.రోడ్డులోని హీరో షోరూమ్‌లో నూతన బైక్‌ల పరిచయ కార్యక్రమం శనివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలర్ ట్రిమ్, బ్లాక్ మెటాలిక్ సిల్వర్‌తో రూపొందించిన హీరో గ్లామర్ వాహనాన్ని ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ ద్విచక్ర వాహనంలో ఎన్నో ప్రత్యేకతలున్నాయని తెలిపారు. సుదూరం పాటు కనిపించేలా ఎల్ఇ హెడ్ ల్యాంప్, ప్రత్యేకంగా ఉంటుందన్నారు. హీరో గ్లామర్ రెండు వేరియంట్‌లో లభిస్తుందని డ్రమ్ వేరియంట్ ధర రూ.83,598లు కాగా, డిస్క్ వేరియంట్ ధర రూ.87,598లుగా నిర్ణయించారని తెలిపారు.

ప్రకృతి సేద్యం ద్వారానే మానవజాతి మనుగడ



మాట్లాడుతున్న వినయ్ రామ్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రకృతి సేద్యం ద్వారానే మానవ మనుగడ సాధ్యమని గ్రీన్ ల్యాండ్ క్యాపిటల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నిడదవోలు వినయ్ రామ్ సూచించారు. భారతీ నగర్‌లోని నోవాటెల్ హోటల్‌లో గ్రీన్ ల్యాండ్ క్యాపిటల్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రకృతి సేద్యం అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సును ఉద్దేశించి గ్రీన్ ల్యాండ్ కాపిటల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వినయ్‌రామ్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ భూములన్నీ కెమికల్‌తో నిండిపోయాయన్నారు. దేశంలో కేవలం 1.5శాతం మాత్రమే సారవంతమైన భూములున్నాయని తెలిపారు. 75 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని కానీ సరిపడా సారవంతమైన భూములు లేని పరిస్థితి నెలకొందన్నారు. పంట భూములను కొనుగోలు చేసిన వారి నుంచి తాము ఆ భూముల్లో సేంద్రియ పంటలు పండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే సుమారు 18 ఎకరాల్లో సేంద్రీయ పద్ధతుల్లో పంటలు పండిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే సారవంతమైన భూములను కాపాడుకోవచ్చని లేకుంటే భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జి కోటేశ్వరరావు, ఎం రమేష్ నాయుడు, ఈ.కిరణ్ కుమార్,ఎన్ పూర్ణచంద్రరావు, బి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ బ్రెయిన్స్‌లో కృష్ణాష్టమి వేడుకలు





ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : లిటిల్ బ్రెయిన్స్ పాఠశాలలో శనివారం ఘనంగా కష్ణాష్టమి వేడుకలు జరిగాయి. బాలబాలికలను తల్లిదండ్రులు చిన్నికృష్ణ గోపికలుగా అలంకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉట్టి కొట్టి విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంస్థ డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి ఆటల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుధ ప్రవీణ ముక్తేవి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అందరికీ కృష్ణాష్టమి వేడుకల విశిష్టతని భారతీయ సంస్కృతి గురించి వివరించారు. 9వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన చిన్ని కృష్ణ నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

శామ్‌సంగ్ వాచ్‌లో హెల్త్ యాప్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శాంసంగ్ వాచీల కోసం శామ్‌సంగ్ హెల్త్ మానిటర్ యాప్‌లో భాగంగా ఇర్రెగ్యులర్ హార్ట్ రిథమ్ నోటిఫికేషన్ ప్రత్యేక ఫీచర్‌ను అందు బాటులోకి తీసుకువచ్చినట్లు శామ్‌సంగ్ రీజనల్ ఇన్‌ఛార్జి ఎం.ఎస్.ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. గుండె దడను, గుండె లయను గుర్తించడంలో ఈఫీచర్ యాప్ సహాయపడుతుందన్నారు.

లోహపు పూత ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నిప్పన్ స్టీల్ సంస్థ ఆధ్వర్యంలో కలర్ కోటెడ్ స్టీల్ బ్రాండ్ ఆప్టిగల్ పేరుతో నూతన ఉత్పత్తిని మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు నిప్పన్ స్టీల్ సంస్థ సీఈవో దిలీప్ ఉమెన్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. గృహ వాణిజ్య ప్రాజెక్టుల కోసం రూఫింగ్, ఫెన్సింగ్, క్లాడింగ్, ప్రీ ఇంజనీరింగ్ భవనాల మరమ్మతుల సమయంలో తుప్పు పట్టకుండా ఉక్కుకు సరికొత్త లోహపు పూత ఆప్టిగల్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. నిర్మాణాల సందర్భంగా వాడే లోహపు పూత దీనిని వినియోగిస్తారన్నారు. ఇటీవల కాలంలో అన్నింటిలోనూ స్టీల్ వాడకంతో పాటు ఇతరత్రా వాడకం పెరుగుతుందని అవి తప్పు పట్టకుండా ఆప్టిగల్ లోహపు పూతను వినియోగిస్తారన్నారు. ఈసందర్భంగా దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.